
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
మంగళవారం 5 ఆగస్టు 2025





నెల్లూరు : విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న వామపక్ష నేతలు

స్మార్ట్ వద్దే వద్దు!

● ఆ మీటర్ల వల్ల ప్రజలపై ఆర్థిక భారం
● విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద వామపక్షాల ఆందోళన

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : 'విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లు వద్దే వద్దు.. వాటిని ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలి' అని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సోమవారం జిల్లావ్యాప్తంగా వామపక్షాలు నిరసన వ్యక్తం చేశారు. నెల్లూరు నగర పరిధిలో మినీబైపాస్ విద్యుత్ సబ్‌స్టేషన్, పడారుపల్లి సబ్‌స్టేషన్ల వద్ద ధర్నా చేపట్టారు. అంతకముందు జరిగిన నిరసన ప్రదర్శనలో ప్రజల నెత్తిన గుదిబండగా మారే స్మార్ట్‌మీటర్లు తమకు వద్దంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ నేత రామరాజు మాట్లాడుతూ అదానీ కంపెనీకి విద్యుత్ రంగాన్ని అప్పనంగా కట్టబెట్టేందుకు స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లను పగలకొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చిన కూటమి నాయకులు అధికారం రాగానే ఆ మీటర్ల వైపే మొగ్గుచేపుతున్నారన్నారు. సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రాంబాబు, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి బసవరాజు, సీపీఐ ఎంఎల్ నాయకులు యానాదయ్యలు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యమం రాష్ట్రంలో పెద్ద ఎత్తున చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసనలో వామపక్ష నేతలు కత్తి శ్రీనివాసులు, మాదాల సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు, సిరాజ్, షాన్‌వాజ్, చిరంజీవి, ఫయాజ్, రమణారెడ్డి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం


నెల్లూరు(విద్య), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మూడు కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పీజీటీ పోస్టులకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామపురంలో కెమిస్ట్రీ, లింగసముద్రంలో ఫిజిక్స్, కలిగిరిలో ఎంపీహెచ్‌డబ్ల్యు సబ్జెక్టుల బోధనకు 2025-26 విద్యా సంవత్సరానికి తాత్కాలికంగా గెస్ట్‌ఫ్యాకల్టీకి నెలకు రూ.12వేల గౌరవ వేతనం అందచేస్తామని పేర్కొన్నారు. పీజీటీ కెమిస్ట్రీకి గ్రాడ్యుయేషన్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీఈడీకి సంబంధించి మెథడాలజీ కలిగి ఉండి ఓసీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు 45, ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు 40శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అలాగే ఫిజిక్స్ కూడా అదే రీతిలో ఎమ్మెస్సీ, బీఈడీ ఉండాలని, ఎంపీడబ్ల్యుహెచ్‌కు నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు సంబంధిత ఎంఈఓ కార్యాలయాల్లో దరఖాస్తులు అందచేయాలని పేర్కొన్నారు.

నాటి స్ఫూర్తి..

● ప్రజాప్రతినిధులకు పట్టని 'పీ4'
● బంగారు కుటుంబాల దత్తతకు ఒక్కరూ ముందుకురాని వైనం

నేడు ఏదీ!?

నెల్లూరు జిలా. బ్రిటీష్ కాలం నుంచి ఈ జిల్లాకు గొప్ప పేరుంది. స్వరాజ్య పోరాట ఉద్యమానికి నగదు, నిత్యావసర వస్తువుల రూపంలో భారీగా విరాళాలు అందించిన చరిత్రలో నెల్లూరుకు గుర్తింపు ఉంది. వేల కోట్ల రూపాయల సంపద కలిగిన శ్రీమంతులు వందల సంఖ్యలో ఉన్నారు. ఆస్తిపాస్తులు వందల కోట్లలో ఉన్న ధనవంతులూ ఉన్నారు. సంపన్నులు, సాయపడే గుణమున్న సమున్నతులు పెద్ద సంఖ్యలో ఉన్న నెల్లూరు జిల్లాలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమం మాత్రం ఎందుకో నత్తనడక సాగుతోంది. అత్యంత పేదరికంలో మగ్గుతున్న నిరుపేద కుటుంబాలకు కాసింత సాయం అందించి సంఘంలో వారు నిలదొక్కుకునేలా ఆపన్న హస్తం అందించే విషయంలో ఎందుకనో మునుపటి స్ఫూర్తి కనిపించడం లేదు. మారిన కాల ప్రభావమా.. లేదా పథకం అమలుతీరులో వైఫల్యమా!? అంతుపట్టడం లేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రే జిల్లాకు వచ్చి పిలుపు ఇచ్చినా సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే స్పందించకపోవడం గొప్ప విశేషం. నిర్దేశించుకున్న లక్ష్యంలో పది శాతం ప్రగతి సాధించడానికే అధికారులు ఆపసోపాలు పడాల్సి రావడం జిల్లా దాతృత్వానికే అవమానం.



నెల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 1,06,878 నిరుపేద కుటుంబాలను అధికార యంత్రంగాం గుర్తించింది. అందులో ఇప్పటికి 11,033 కుటుంబాలను దత్తత తీసుకోవడానికి మాత్రమే దాతలు ముందుకొచ్చారు. ఇంకా 90వేల కుటుంబాలు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇప్పటివరకు దత్తతకు ముందుకు వచ్చిన వారిలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, చివరికి కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. అయితే జిల్లాలోని ప్రజాప్రతినిధుల్లో మాత్రం దత్తతకు స్పందన కనిపించడం లేదు.

● ఎంపిక ఇలా

ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతోపాటు వివిధ సర్వేల ద్వారా జిల్లాలోని నిరుపేదల కుటుంబాలను గుర్తించారు. ఈ జాబితాను వేరు వేరు బృందాల ద్వారా పరిశీలించి నిర్ధారించుకున్నారు. కుటుంబ అవసరాలు, సామాజిక స్థితిగతులు, కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అందించాల్సి వనరులు, ఆరోగ్య సమస్యలు, పిల్లల చదువులు తదితర వివరాలను సేకరించారు. దత్తత ద్వారా వీరికి అండగా నిలువగలిగితే ఈ కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయని దారిద్ర్య రేఖను దాటుకుంటాయని అంచనా వేశారు.

అధికారుల విశ్వప్రయత్నం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమం కావడంతో కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన జిల్లా అధికార యంత్రాంగం ఈ పథకాన్ని విజయవంతం చేయడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. నియోజకవర్గాల వారీగా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ధనవంతులను మార్గదర్శులుగా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. వీరు ఎంత గట్టిగా ప్రయత్నించినా మార్గదర్శుల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగకపోవడంతో శాఖల వారీగా ఉద్యోగుల సమావేశాలు ఏర్పాటు చేసి వారికి సైతం ఒకటి రెండు కుటుంబాలను దత్తత తీసుకునేలా మోటివేట్ చేస్తున్నారు.

● ఏ నియోజకవర్గంలో ఎందరు!?

జిల్లావ్యాప్తంగా 1,06,878 బంగారు కుటుంబాలను గుర్తించగా, సగటున ఒక్కో నియోజకవర్గం నుంచి పదివేలకుపైగా కుటుంబాలు ఉన్నాయి. అయితే మార్గదర్శులు ఆశించిన స్థాయిలో ముందుకు రాకపోవడంతో ఇప్పటికి 11,033 కుటుంబాలను మాత్రం దత్తత తీసుకున్నారు. కోవూరులో అత్యధికంగా 3169 కుటుంబాల ను 873 మంది మార్గదర్శులు దత్తత తీసుకోగా నెల్లూరు రూరల్‌లో అత్యల్పంగా 636 కుటుంబాలను 240 మంది మార్గదర్శులు దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చారు.

నియోజకవర్గం	కుటుంబాలు	మార్గదర్శులు
ఆత్మకూరు	1820	407
కందుకూరు	947	315
కావలి	642	352
కోవూరు	3169	873
నెల్లూరుసిటీ	393	132
నెల్లూరురూరల్	636	240
సర్వేపల్లి	1429	506
ఉదయగిరి	2047	527
మొత్తం	**11033**	**3352**

● ఎమ్మెల్యేల్లో కనిపించని ఆసక్తి

సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు ఇచ్చి.. ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ఈ పథకాన్ని ప్రారంభించినా ప్రజాప్రతినిధుల్లో ముఖ్యంగా నియోజకవర్గాల్లో సర్వం తామై వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేల్లో పీ4 పట్ల పెద్దగా ఆసక్తి కనిపించడం లేదు. జిల్లా ఎమ్మెల్యేల విషయానికి వస్తే అందరూ స్థితిమంతులే. కనిష్ఠంగా వందల కోట్ల కన్నా తక్కువ స్థితిమంతులు ఎవరూ లేరు. వేల కోట్లకు పడగలెత్తిన వారూ ఉన్నారు. ఒక్కో ఎమ్మెల్యే తాను పుట్టి పెరిగిన ఊరినో లేదా నియోజకవర్గంలో బాగా వెనుకబడిన గ్రామాలనో దత్తత తీసుకొని ఇతరులకు స్ఫూర్తి నింపవచ్చు. లేదా కొన్ని కుటుంబాలనైనా దత్తత తీసుకోవచ్చు. కానీ ఎందుకనో ఒకరిద్దరు మినహా ఎవరూ స్పందించడం లేదు. మంత్రి పొంగూరు నారాయణ తన సంస్థల ద్వారా వీఆర్ స్కూల్‌తో వెయ్యి మంది విద్యార్థులకు పీ4 పథకం కింద ఉచితంగా పుస్తకాలు, ప్రతిరోజు భోజనవసతి కల్పిస్తున్నారు. దాతల సహకారంతో పీ4 కింద ఈ స్కూలును అత్యాధునికంగా మార్చు చేశారు. ఇదే స్ఫూర్తితో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆర్ఎస్ఆర్ స్కూలును దత్తత తీసుకున్నారు. ఇంతకు మించి ఎమ్మెల్యేలు ఎవరూ మార్గదర్శులుగా మారలేదు. ముఖ్యమంత్రి స్వయంగా రెండు, మూడు పర్యాయాలు ఎమ్మెల్యేలతో పీ4 పథకం గురించి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్వయంగా వీరు మార్గదర్శులుగా మారే విషయం అటుంచితే తమ నియోజకవర్గ పరిధిలో వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు చెందిన వారిని మార్గదర్శులుగా చేర్పే విషయంలోనూ ఆశించిన తీరుగా స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లా ఆర్థిక, సామాజిక స్థితిగతుల ఆధారంగా పరిశీలిస్తే ఇలాంటి సేవా కార్యక్రమాల్లో రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల కన్నా నెల్లూరు ముందు ఉండాలి. కానీ పాలకుల్లో స్పందన అంతంత మాత్రంగా ఉన్న కారణంగా జిల్లాలో పీ4 అధికారుల రెక్కల కష్టం మీద నడుస్తున్నట్లు అనిపిస్తోంది.

గుర్తించిన బంగారు కుటుంబాలు	: 1,06,878
అత్యధికం కోవూరు నియోజకవర్గం	: 3169
ముందుకు వచ్చిన మార్గదర్శులు	: 3352
దత్తత తీసుకున్న కుటుంబాలు	: 11033

ముగిసిన కాకాణి సిట్ కస్టడీ

● భూ రికార్డులపై 25 ప్రశ్నలు అడిగిన అధికారులు
● అన్నిటికీ 'నాకు తెలియదు.. నాకేం సంబంధం' అంటూ బుకాయింపు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సిట్ కస్టడీ సోమవారం ముగిసింది. నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న కాకాణిని రెండు రోజుల విచారణ నిమిత్తం కోర్టు అనుమతులతో సిట్ పోలీసులు ఆదివారం కస్టడీలోకి తీసుకున్నారు. వెంకటాచలం మండలం కాకుటూరు పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములను పట్టా భూములుగా రికార్డులు మార్చిన కేసులో కాకాణి రిమాండ్‌లో ఉన్నారు. సిట్ డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాకాణిని నెల్లూరు డీటీసీలో ఆది, సోమవారాల్లో విచారించారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు భూములుగా మీ సహకారం లేకుండానే మార్చారా!? భూముల మార్పిడిలో ఎవరెవరు ఉన్నారు!? ఇంకెన్ని భూములను మార్చారు ఇలా 25 దాకా ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. సిట్ అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నకు నాకు తెలియదు.. నాకు సంబంధం లేదు అన్న సమాధానాలు మాత్రమే కాకాణి ఇచ్చినట్లు సమాచారం.

సిగ్గు పడాలి..!

● ఎస్టిమేషన్లు వేయడానికి ఏడాది కావాలా? ● ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈపై జేసీ ఆగ్రహం

నెల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : 'ఏంటండీ ఇది.. ఒక ఎస్టిమేషన్ వేయడానికి ఏడాది కావాలా!? సిగ్గుపడాలండీ!' అంటూ జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రెడ్డప్పపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూరు మండలం పమిడిపాడు, ఏఎస్‌పేట మండలం పునుగోడు గ్రామాలకు చెందిన కొందరు రైతులు తమ సమస్యపై సోమవారం ప్రజావిజ్ఞప్తుల వేదికలో జేసీకి అర్జీ ఇచ్చారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ భూసేకరణలో తమ భూములు తీసుకుంటున్నారని, అయితే, పరిహారం చెల్లింపులో తమ పొలాల్లోని చెట్లు, బోర్లను ఎస్టిమేషన్ వేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని జేసీకి విన్నవించుకున్నారు. భూసేకరణ అథారిటీ ఆదేశాలు ఇచ్చి ఏడాది దాటినా ఇంతవరకు అధికారులెవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. రైతుల ఆవేదనను విన్న జేసీ కార్తీక్.. ఆర్‌అడబ్ల్యూఎస్ ఎస్ఈ రెడ్డప్పను పిలిచారు. రైతుల పొలాల్లో బోర్లు ఎన్ని ఉన్నాయో వాటి ఎస్టిమేషన్లు వేసి పంపాలని ఆర్డీవో లేఖ రాసినా, ఏడాది నుంచి రైతులు కోరుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ప్రశ్నించారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ ఎస్టిమేషన్లు వేయలేకపోతున్నారంటే సిగ్గుపడాలి.. అంటూ జేసీ వ్యాఖ్యానించారు. వెంటనే రైతుల సమస్యను పరిష్కరించాలని ఎస్ఈను ఆదేశించారు. ఈ వ్యవహారం అధికార వర్గాల్లో చర్చనీయాంశమైంది.

● పనితీరుపై విమర్శలు

జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ పనితీరు విమర్శలకు తావిస్తోంది. ఇటీవల జడ్పీ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలోనూ జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పనితీరును ఎత్తి చూపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ఏడాది క్రితం నిధులు మంజూరు చేసినా ఎందుకు పనులు చేయలేదని ఎస్ఈను నిలదీశారు. సాక్షాత్తూ జడ్పీ కార్యాలయంలోనే పైపులైన్ పనులు చేయించలేని వారు, ఇక జిల్లా మొత్తం ఎలా పనులు చేయిస్తారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వరుస ఘటనలను బట్టి చూస్తే ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం!

● నేటి నుంచి ఉద్యోగుల వినూత్న నిరసన

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం 'టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు బి.సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పీఆర్సీ, ఆర్జిత సెలవుల రూపంలో ఉద్యోగులకు బకాయిలుగా ఉన్న రూ. 30వేల కోట్ల సాధన కోసం ఈ వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం నుంచి జిల్లావ్యాప్తంగా అన్ని తాలూకాల స్థాయిలో వారానికి ఒకరోజు ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులతో రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం జరుగుతుందన్నారు. మంగళవారం ప్రభుత్వ ప్రధాన వైద్యశాల, ఎంపీడీఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

కందుకూరు

సబ్ కలెక్టర్‌గా హిమవంశీ



కందుకూరు ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు సబ్ కలెక్టర్‌గా దామెర హిమవంశీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడున్న తిరుమణి శ్రీపూజను బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఇక కొత్త సబ్‌కలెక్టర్ హిమవంశీ తెలంగాణలోని నల్లగొండ వాసి. 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారైనా హిమవంశి రూర్కి ఐఐటీలో జియోఫిజికల్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన అనంతరం సివిల్స్‌కి ప్రిపేరై నాల్గవ ప్రయత్నంలో ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. కరేడులో భూసేకరణ, రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమలకు భూసేకరణపై రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్న నేపథ్యంలో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజను బదిలీ చేయడం గమనార్హం

ఎర్రచందనం అక్రమ రవాణా కేసు

మరో నలుగురి అరెస్ట్!

● నిందితుల్లో వైసీపీ నాయకుడు

ఉలవపాడు/కలిగిరి, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కరేడుకు చెందిన లంకా వినోద్ ముగ్గురు వ్యక్తులతో కలిసి రూ.6లక్షల విలువైన 11 ఎర్రచందనం దుంగలను మినీ వ్యానులో తరలిస్తూ గత నెల 23వ తేదీన తిరుపతి జిల్లా వరదయ్యపాళెం పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వెనుక వైసీపీకి చెందిన ఓ నాయకుడు ఉన్నట్టు అప్పట్లో గుప్పుమంది. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. కరేడుకు సంబంధించి భూసేకరణ అంశం వివాదాస్పదం కావడం, పోలీసులు ఇతర నిఘా వర్గాలు తనిఖీలు ముమ్మరం చేస్తుండటంతో దాచి ఉంచిన ఎర్రచంద నాన్ని వీలైనంత త్వరగా చెన్నైకు తరలించాలన్న ఉద్దేశంతోనే ఈ స్మగ్లింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న వెంటనే వైసీపీకి చెందిన ఓ నాయకుడు రంగంలోకి దిగి బేరసారాలు సాగించినట్లు అప్పట్లో గుప్పుమంది. పట్టుబడ్డ దుంగలు కూడా కలిగిరి మండలం తూర్పుదూబగుంట అగ్రిగోల్డ్ భూముల్లోనివిగా గుర్తించారు.

● తాజాగా మరో నలుగురు

ఎర్రచందనం రవాణా కేసులో తాజాగా మరో నలుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో కరేడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, కరేడు భూసేకరణ ఉద్యమ నేత నల్లపరెడ్డి అజిత్‌రెడ్డితోపాటు అదే గ్రామానికి చెందిన వడ్రంగి పనిచేసే శ్రీహరి, అతని కుమారుడు నిరంజన్, బోగోలు మండలం తిప్ప గ్రామానికి చెందిన రాజేష్‌లను కలిగిరికి చెందిన పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్సై ఉమాశంకర్ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

మీ యాప్‌లొద్దు.. మీ సెల్‌ఫోన్లూ వద్దు!

● కావలిలో అంగన్వాడీల నిరసన
● సీడీపీవో కార్యాలయంలో ఫోన్లు ఉంచిన వైనం

కావలి (టౌన్), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : 'మీ యాప్‌లు వద్దు.. సెల్ ఫోన్లూ వద్దు..' అంటూ అంగన్వాడీ కార్యకర్తలు కావలిలో సోమవారం ఆందోళన చేశారు. ప్రభుత్వం అందించిన సెల్ ఫోన్లను ప్రాజెక్ట్ కార్యాలయంలో ఉంచేసి వెళ్ళిపోయారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ముసునూరులోని అంగన్వాడీ ప్రాజెక్ట్ కార్యాలయం వద్దకు 14 సెక్టార్ల పరిధిలోని అంగన్వాడీలు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లను సమీకరించి ఓ అట్టపెట్టెలో భద్రపరిచి కార్యాలయంలో ఉంచేసి వచ్చారు. సీఐటీయూ నాయకుడు పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు సెల్‌ఫోన్లను అందించి యాప్‌ల ద్వారా అదనపు పనిభారం మోపిందని, ఆ ఫోన్లు సరిగ్గా పనిచేయక అంగన్వాడీలు మానసిక క్షోభ అనుభవిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతోనే ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. అలాగే అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు, హెల్పర్లకు ప్రమోషన్లు, గ్రాడ్యూటీల్లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. సీడీపీవో కార్యాలయంలో సెల్‌ఫోన్లు తీసుకునేందుకు ఎవరూ అంగీకరించకపోవడంతో కార్యాలయంలోనే ఉంచి వచ్చేశారు. ఈ నిరసనలో సీఐటీయూ నాయకులు కృష్ణయ్య, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జయంతి, సుభాషిణి, విజయలత, రఘురావమ్మ, సౌజన్య, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇదే అంశంపై రాహూరు, అనంతసాగరం, వెంకటాచలం తదితర ప్రాంతాల్లోనూ అంగన్‌వాడీలు ఆందోళన చేశారు.



సెల్‌ఫోన్లను అట్టపెట్టెల్లో ఉంచి సీడీపీవో కార్యాలయంలో ఉంచుతున్న అంగన్వాడీలు

'ఆల్తూరుపాడు'పై ఆశలు

● రూ.733 కోట్లతో రివైజ్డ్ ప్రతిపాదనలు ● ముఖ్యమంత్రి హామీ.. ఫైనాన్స్‌కు చేరిన ఫైల్

ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు తాగు, సాగునీటి పరంగా కీలకమైన ఆల్తూరుపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంపై ఆశలు చిగురిస్తున్నాయి. రాజకీయ కక్షతో జరుగుతున్న పనులను నాటి వైసీపీ ప్రభుత్వం అర్థంతరంగా ఆపేయగా.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో రిజర్వాయర్ నిర్మాణానికి కొత్త ఎస్టిమేషన్లు తయారు చేసి పంపాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులు రూ.733 కోట్లతో రివైజ్డ్ అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వ ప్రాధాన్యత ప్రాజెక్టుల కింద ఆల్తూరుపాడు చేర్చడంతో సదరు ఫైల్ వేగంగా కదులుతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

-వివరాలు 8లో



అర్ధంతరంగా ఆగిపోయిన ఆల్తూరుపాడు ప్రాజెక్టు పనులు

నేడు సీబీఎస్ఈ క్లస్టర్ అథ్లెటిక్ పోటీలు

వెంకటాచలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద గల అక్షర విద్యాలయంలో మంగళవారం నుంచి సీబీఎస్ఈ క్లస్టర్ అథ్లెటిక్ పోటీలు ప్రారంభం కానున్నాయని అక్షర పాఠశాల డైరెక్టర్ కుముదా, ప్రిన్సిపాల్ ప్రియా జాకబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ వేడుకలు స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ ఆధ్వర్యంలో జరగనున్నాయన్నారు. వేడుకలకు కలెక్టర్ ఆనంద్, సర్వేపల్లి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9589
వెండి కిలో ధర	రూ. 115200
వెండి ఒక గ్రాము	రూ. 118.20

సేద్యానికి 'డ్రోన్' అంత సాయం!

● డ్రోన్‌లతో మందుల పిచికారీ సులభతరం
● సమయం, ఖర్చులు ఆదా

విడవలూరు, ఆగస్టు 4: వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. గతంలో కూలీలపై ఆధారపడి రైతులు వ్యవసాయం చేసేవారు. కాలక్రమేణ వ్యవసాయ రంగంలో భూమిని దున్నటానికి ట్రాక్టర్లు, నాట్లు వేయడానికి, పంటని కోసేందుకు వరికోత యంత్రాలు రంగ ప్రవేశం చేశాయి. దీంతో రైతులకు వ్యవసాయం కొంత వరకు సులభతరమైంది. అయితే కలుపు తీయటానికి, పురుగు మందుల పిచికారికి ఇప్పటికీ కూలీలపైనే రైతులు ఆధారపడుతున్నారు. దీనివల్ల వ్యవసాయ ఖర్చులు పెరుగటమే కాకుండా చాలా సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో డ్రోన్లతో మందులు పిచికారీ చేసే సౌకర్యం అందుబాటులోకి రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● **డ్రోన్లతో మందుల పిచికారీ**

మారుతున్న కాలానికి అణుగుణంగా రైతులు కొత్త బాట పడుతున్నారు. కూలీలతో పురుగు మందులు పిచికారీ చేసే రైతులు ప్రస్తుతం డ్రోన్ల సహాయంతో మందులను పిచికారీ చేస్తున్నారు. బద్వేలు, ఉభయగోదావరి


డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతులు

జిల్లాల నుంచి డ్రోన్ల నిర్వాహకులను పిలిపించుకుని పురుగు మందులు పిచికారి చేయించుకుంటున్నారు. సాధారణంగా 10 ఎకరాలకు సరిపోయే ఒక లీటర్ పురుగు మందు డ్రోన్ల ద్వారా పిచికారీ చేస్తే 13 ఎకరాలకు వస్తోందని, పైగా సమయం, ఖర్చులు కూడా తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు.

● **ఒక్కరోజులో 50 ఎకరాలకు..**

కూలీల చేత 50 ఎకరాలకు పురుగు మందు పిచికారీ చేయాలంటే 7 రోజుల సమయంతో పాటు ఒక ఎకరాకు రూ.600 ఖర్చు అవుతుంది. అదే డ్రోన్ ద్వారా అయితే ఒక్కరోజులోనే 50 ఎకరాలకు పిచికారి చేయవచ్చు. ఖర్చు కూడా ఎకరాకు 350 మాత్రమే. డ్రోన్లతో మందుల పిచికారి సులభంగాను, లాభదాయకంగానూ ఉండటంతో రైతులు ఈ పద్ధతినే అనుసరించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

డ్రోన్లతో మందుల పిచికారీ సులభం



వ్యవసాయ సాగులో ప్రధాన సమస్య కూలీలు అందుబాటులో ఉండక పోవటంతో సీజన్‌లో కూలీలకు భారీ డిమాండ్ ఉంటుంది. సకాలంలో కూలీలు దొరక్క పంట దెబ్బతింటుంది. ప్రస్తుతం డ్రోన్‌లు అందుబాటు లోకి రావటంతో వాటి ద్వారా పురుగు మందులను పీచికారి చేయిస్తున్నాము. దీనివలన మందుల పీచికారి సులభతరంగాను, లాభదాయకంగా ఉంది.

- బెజవాడ గోవర్ధన్ రెడ్డి, వావిళ్ల నీటి సంఘం అధ్యక్షుడు

కౌలు రైతులకు పెట్టుబడి సాయం

శ్రీహరి, బుచ్చి మండల వ్యవసాయాధికారి



రైతులకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మండల వ్యవసాయాధికారి నడవాటి శ్రీహరి పేర్కొన్నారు. భూమిలేని కౌలు రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుందన్నారు.

?.. రైతులకు ప్రభుత్వం ఏఏ రకాల సంక్షేమ పథకాలు అందిస్తోంది

!.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 'అన్నదాత సుఖీభవ' పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 14 వేలు 3 విడతలుగా రైతులకు అందిస్తోంది. పెట్టుబడి సాయం కింద వారి ఖాతాలకు నగదు జమ చేస్తోంది. 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువులు, వ్యవసాయ యాంత్రీకరణ కింద వ్యవసాయ పరికరాలు, డ్రోన్ స్ప్రేయర్లు, 1 కేజీకి రూ.5 రూపాయల సబ్సిడీతో వరి విత్తనాలు పంపిణీ చేసింది.

?.. మండలంలో ఎంతమంది రైతులు ఈ పథకాలను పొందారు

!.. 3244 మంది రైతులకు ఈ పథకాలు అందాయి. భూమిలేని కౌలు రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. ఈమేరకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. ఈ పథకాలకు అర్హులైన రైతుల జాబితాను గ్రీవెన్స్ ద్వారా ఎంపిక చేసి, ప్రభుత్వానికి పంపుతాం.

?.. గత ప్రభుత్వం ఆపేసిన జింకు, జిప్సంను సబ్సిడీతో మళ్ళీ ఇచ్చే అవకాశాలున్నాయా

!.. భూసార రక్షణ పథకాన్ని పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మళ్లీ రైతులకు సబ్సిడీతో జింకు, జిప్సం ఎరువులను అందజేయనుంది.

పేదల ముంగిటకే సంక్షేమ పథకాలు



ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ముత్తుకూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలను పేదల ముంగిటకే చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పైనంపురం సర్పంచ్ కావలి విజయ్‌కుమార్ తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జునయాదవ్ ఆదేశాలతో సోమవారం గ్రామంలో స్వామిత్వ గ్రామసభ ర్యాలీ నిర్వహించామన్నారు. అధికారులు ప్రతీ ఇంటికి వెళ్లి పూర్తిస్థాయిలో సర్వే చేసి వివరాలను నమోదు చేస్తారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేర్చడమే తమ బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పట్టపు శోభన్‌బాబు, కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇందుకూరుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగదేక కమ్యూనిటీహాల్‌లో తిక్కవరపు రామచంద్రారెడ్డి, దేవసేనమ్మ జ్ఞాపకార్థం కుమారుడు తిక్కవరపు శ్రీధర్‌రెడ్డి, దీప్తి ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయ పర్యవేక్షణలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరంలో కంటి వ్యాధిగ్రస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శిబిరం 7 రోజులు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. తిక్కవరపు కార్తీక్‌రెడ్డి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేకం

ఆత్మకూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అలఘనాథస్వామి ఆలయం లో మంగళ వారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్న పుష్కర మహోత్సవ మహా కుంభాభిషేకం ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం ఉదయం పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారు.

ఏఎంసీ ద్వారా గోదాముల నిర్మాణానికి కృషి

ఏఎంసీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణలో ఎమ్మెల్యే సోమిరెడ్డి


సర్వేపల్లి ఏఎంసీ పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఏఎంసీ ద్వారా గోదాముల నిర్మాణానికి కృషి చేస్తామని, అధికారులు రైతు ప్రయోజనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటాచలంలోని ఏఎంసీ కార్యాలయంలో సోమవారం సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్‌గా గాలి రామకృష్ణారెడ్డి, వైస్ చైర్ పర్సన్‌గా అరుణమ్మ, డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై వారిని అభినందించారు. రైతులు పండించిన పంట నిల్వ కోసం ఏఎంసీ ద్వారా గోదాముల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. సెస్ వసూలు ద్వారా గతేడాది సర్వేపల్లి ఏఎంసీకి రూ.2.30 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. లక్ష ఎకరాల్లో సగటున 4 లక్షల పుట్ల ధాన్యం దిగుబడి వస్తుందన్నారు. ఈ లెక్కన ఏఎంసీకి సెస్ రూ.15 కోట్లకుపైగా రావాలన్నారు. 2021 - 23లో రూ.1.61 కోట్లు, 2023 - 24లో రూ.1.84 కోట్లు మాత్రమే వచ్చిందన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు ఇద్దరు మాత్రమే ఉండగా 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 10 మంది ఔట్ సోర్సింగ్ విధానంలో కొనసాగుతున్నారన్నారు. సిబ్బంది కొరత సమస్యను అధిగమించి ఏఎంసీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చాక సర్వేపల్లి నుంచి రూ.2.70 కోట్ల అంచనాలతో పలు పనులను ప్రతిపాదించామన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలే పిల్లలకు శ్రేష్టం


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారి రంగమ్మ

ముత్తుకూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ తెలిపారు. ముత్తుకూరు మండలం మామిడిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి నుంచి వచ్చే ముర్రుపాలు పిల్లలకు వ్యాధి నిరోధక శక్తితో పాటు మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. తల్లిపాల ఆవశ్యకతను గర్భిణీలు, బాలింతలకు వివరించారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పావని, లక్ష్మి, స్రవంతి, గంగాభవానీ పాల్గొన్నారు.

భాషాభివృద్ధికి 'మండలి' కృషి అభినందనీయం

బుచ్చి శాఖాగ్రంథాలయంలో వెంకటకృష్ణారావు శతజయంతి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి మండలి వెంకట కృష్ణారావు అత్యున్నత సేవలందించారని బుచ్చి శాఖా గ్రంథాలయాధికారి అల్లాడి సరసింహారావు కొనియాడారు. సోమవారం గ్రంథాలయంలో మండలి శత జయంతి సభ నిర్వహించారు. మండలి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మండలి వెంకట కృష్ణారావు ప్రపంచ తెలుగు మహా సభలను ప్రారంభించడంతోపాటు అంతర్జాతీయ తెలుగు మండలిని ఏర్పాటు చేశారన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలను ఏకం చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో బాధితులకు


నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి

పునరావాసం కల్పించి ఆదుకున్నారన్నారు. పార్లమెంట్ సభ్యుడుగా, మంత్రిగా సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ గండికోట సుధీర్‌కుమార్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల దత్తత అభినందనీయం : ఆర్డీవో

ఆత్మకూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగంగా పలువురు ముందుకొచ్చి మార్గదర్శులుగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం అభినందనీయమని ఆర్డీవో పావని తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో పలు కుటుంబాలను దత్తత తీసుకున్న వారిని ఆమె సన్మానించి అభినందించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మరికొందరు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని పీ-4 కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఆమె పిలుపు నిచ్చారు. మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బాలసంజీవిని యాప్ తొలగించాలి


వెంకటాచలం: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

రాపూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బాల సంజీవిని యాప్, ఓటీపీ, ఈకేవైసీ నిబంధనలను తొలగించాలని అంగన్‌వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. రాపూరు సీడీపీఓ కార్యాలయం వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన తెలిపి, సీడీపీవో కార్యాలయంలో మొబైల్ ఫోన్లను అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ కాలం చెల్లిన మొబైల్ ఫోన్లు అంగన్‌వాడీలకు ఇవ్వడం వల్ల 90 శాతం పాడయ్యాయన్నారు. నెట్‌వర్క్ వేగంగా ఉండే మొబైల్ ఫోన్లను ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● **వెంకటాచలం :** వెంకటాచలంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి రెహనా బేగం మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2022లో ఇచ్చిన స్మార్ట్ ఫోన్లు యాప్‌లకు సపోర్టు చేయడం లేదన్నారు. ఆరు నెలలుగా కొత్త ఫోన్లు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఇరగాలయ్య, వెంకటాచలం ప్రాజెక్టు కార్యదర్శి సుగుణమ్మ, మండల అధ్యక్షురాలు లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రసాయనాలతో పండించిన కూరగాయలు తినకండి


కూరగాయలు కొనుగోలు చేస్తున్న శ్రీనివాసులు రెడ్డి

విడవలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రసాయనాలతో పండించిన కూరగాయలు ఆరోగ్యానికి హానికరమని, సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలనే కొనుగోలు చేయాలని మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో రైతు సాధికార సంస్థ, ఏపీ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజరు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సేంద్రియ పద్ధతుల్లో ఉత్పత్తి చేసిన కూరగాయల స్టాల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆకుకూరలు కొనుగోలు చేశారు. పంటల సాగులో రసాయనాల వాడకంతో మనిషి ఆయుష్షు తగ్గిపోతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీ శ్రీకాంత్, ఐసీఆర్పీలు మౌనిక, సురేష్, రాకేష్, విజయలక్ష్మి, దేవికుమారి, శ్యామల, నరేష్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం

కోవూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించడం తగదని సీపీఎం జిల్లా నాయకుడు మోహన రావు అన్నారు. స్థానిక విద్యుత్తు శాఖ కార్యా లయం ఎదుట సోమవారం సీపీ ఎం ఆధ్వ ర్యంలో



కోవూరు : ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

జరిగి న ధర్నాలో ఆయన మాట్లా డారు. ఆదానీ సంస్థకు లబ్ధిని చేకూర్చేందుకే ఇళ్ళకు కూడా స్మార్ట్ మీటర్లను బిగిం చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసు కుంద న్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పేదలు చీకట్లో మగ్గాల్సిందేనన్నారు. ఆందోళనలో సీపీ ఎం నాయకులు శేషయ్య, బుజ్జయ్య, అఫ్రోజ్, హరి, సురేష్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం :** ప్రజలపై భారం మోపేందుకే ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ వెంకమరాజు అన్నారు. సోమవారం మండలంలోని జొన్నవాడ, రేబాల, దామరమడుగులోని విద్యుత్ ఏఈఈ కార్యాలయం, సబ్ స్టేషన్ల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సురేష్, కృష్ణప్రసాద్, శ్రీనివాసులు, మల్లికార్జున, ఎం. సురేష్, కే. రమణయ్య, టి.రమణయ్య, మల్లికార్జున, బాబు, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అనంతసాగరం ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సాగరం బీసీ కాలనీకి చెందిన పీ ప్రవీణ్ (25) అనే యువకుడు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సేకరించిన వివరాల మేరకు.. ప్రవీణ్ నాగుర్‌కర్నూల్‌లో ప్లేవుడ్ వ్యాపారం చేస్తున్నాడు. ఈతరుణంలో ఆదివారం మోటారుబైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. అతని అంత్యక్రియలు సోమవారం అనంత సాగరంలో జరిగాయి.

కస్టడీ నుంచి నిందితుడి పరారీ

● ఒడిశాలో అరెస్టు చేసిన పోలీసులు


నిందితుడి వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పట్టుబడి సెబ్ స్టేషన్‌లో విచారిస్తుండగా కానిస్టేబుల్‌పై దాడి చేసి, ఓ వ్యక్తి పరారయ్యాడు. అతన్ని నగరంలోని చిన్న బజారు పోలీసులు మూడేళ్ల తర్వాత ఒడిశా రాష్ట్రంలో అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను చిన్న బజారు పోలీసు స్టేషన్‌లో సోమవారం ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు విలేకరులకు వివరించారు. ఒడిశా రాష్ట్రంలోని అటవీ ప్రాంతం నుంచి గంజాయిని నెల్లూరుకు తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్న జే. బిస్వాస్‌ను 2022 జనవరి 8న తెల్లవారుజామున సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శివగిరికాలనీలోని సెబ్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. బిస్వాస్ బాత్రూంకి వెళ్లాలని కోరడంతో సెంట్రీ కానిస్టేబుల్ రవి తీసుకెళ్లాడు. ఆ సమయంలో నిందితుడు కానిస్టేబుల్‌పై దాడి చేసి పరారయ్యాడు. అదేరోజు అప్పటి సెబ్-2 ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి మూడేళ్లుగా నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఈ కేసుపై దృష్టి సారించి ప్రత్యేక బృందాన్ని ఒడిశాకు పంపారు. ఎట్టకేలకు బిస్వాస్‌ను అటవీ ప్రాంతంలో అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేయడంలో కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, ఎస్ఐ అయ్యప్ప, కానిస్టేబుల్స్ ఎస్‌వీ శ్యాంప్రసాద్, ఎం. సుబ్బారావులను ఉన్నతాధికారులు అభినందించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారం, వెండి ఆభరణాలు, నగదుఅపహరణ


బీరువా తాళాలు పగలగొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు

కావలి రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆనెమడుగు పంచాయతీ మొండి దిన్నెపాలెంలోని విశ్రాంత పోస్టు వ్ మాస్టర్ ద్రోణాదుల వెంకట సుబ్రహ్మణ్యం ఇంట్లో చోరీ జరిగిన ఘటన సోమ వారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. బాధితుడి బంధువుకు అనారోగ్యంతో ఉండటంతో ఆయనను పరామర్శించేందుకు ఈనెల 1వ తేదీ రాత్రి భార్య సామ్రాజ్యమ్మతో కలసి వెంకట సుబ్రహ్మణ్యం ఇంటికి తాళం వేసుకుని హైదరాబాద్‌కు వెళ్లారు. వెంకట సుబ్రహ్మణ్యం పెద్ద కుమారుడు కెనడాలో ఉండగా రెండవ కుమారుడు వెంకట గిరి కావలి పట్టణంలో ఉంటున్నాడు. ఆయన తన తల్లిదండ్రులు ఇంట్లో లేకపోవడంతో 2వ తేదీన మొండిదిన్నెపాలెంలోని ఇంటికి వెళ్లి చెట్లకు నీరు పట్టి ఆ రాత్రి కావలి వెళ్లాడు. మరుసటి రోజు ఆదివారం సాయంత్రం చెట్లకు నీరు పట్టేందుకు ఆయన మళ్లీ ఇంటికి వెళ్లగా ఇంటి గ్రిల్స్ తాళాలు, తలుపుల తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు ఇంట్లో ఉన్న బీరువా తాళాలు పగలగొట్టి వస్తువులు చిందరవందర చేసి ఉండడాన్ని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చాడు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన వెంకట సుబ్రహ్మణ్యం ఇంట్లో పరిశీలించగా రెండు బీరువా ల్లోని సుమారు 20 సవర్ల బంగారు ఆభరణాలు, 1.5 కేజీల వెండి వస్తువులు, రూ.11వేలతోపాటు, 3 లాఫింగ్ బుద్ధ హుండీ విగ్రహాల్లో ఉం చిన రూ.30,000 (రూ.5 కాయిన్స్) అపహరించు కెళ్లినట్లు గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ ఎస్ఐలు బాజీబాబు, కృష్ణయ్యలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలు స్వీకరించారు. 2వ తేది రాత్రి, లేదా 3వ తేదీన తెల్లవారు జామున దుండగులు చోరీకి పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్తను హతమార్చిన భార్య

● రక్తపు మరకలు తుడిచి ప్రమాదంగా చిత్రీకరణ
● మృతదేహాన్ని తడిమి చూడగా గాయాలు


శ్రీనివాసకుమార్ మృతదేహం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి): మద్యం మత్తులో భర్త దూషించ డంతో కత్తితో పొడిచి చంపిన భార్య ఉదంతమిది. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు శెట్టిగుంట రోడ్డుకి చెందిన గోలి శ్రీనివాసకుమార్ (38)కు, ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన లక్ష్మీ ప్రసన్నతో 13 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారి కి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమా రుడు. శ్రీనివాసకుమార్ కొయ్యలకు పాలీష్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిం చేవాడు. ప్రస్తుతం వారు నవాబుపేట పరిధి న్యూకాలనీలో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి శ్రీనివాస కుమార్ మద్యం మత్తులో మిద్దెపైకి ఎక్కేటప్పుడు మెట్లపై నుంచి జారి కిందపడి చనిపోయాడని లక్ష్మీప్రసన్న మనుబోలులో ఉంటున్న తన వదిన (మృతుడి అక్క) రమణమ్మకు ఫోన్‌చేసి చెప్పింది. వెంటనే ఆమె తమ కుటుంబసభ్యులతో కలిసి నెల్లూరుకి చేరుకుంది. మెట్ల పక్కనే పడిఉన్న తమ్ముడి మృతదేహాన్ని పట్టుకొని భోరున ఏడుస్తుండగా, ఎడమ పిరుదుపై రెండు చోట్ల కత్తి గాయాలు ఉండటాన్ని గమ నించింది. దీంతో ఆమె లక్ష్మీప్రసన్నను అడిగేందుకు చూడగా ఆమె కనిపించలేదు. దీంతో అన్న కుమార్తె వెంకటసాయి భవానీని అడగ్గా అసలు విషయం బయటకు వచ్చింది.

● **రక్తపు మరకలు తుడిచేసి...**

కొంతకాలంగా శ్రీనివాసకుమార్ మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై భార్యభర్తల మధ్య తరచూ గొడవలు, ఘర్షణలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో ఆదివారం దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో శ్రీనివాసకుమార్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటాక మళ్లీ ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో మరోసారి గొడవ పడ్డారు. భర్త దూషించాడని ఆవేశానికి గురైన లక్ష్మీ ప్రసన్న కత్తితో గట్టిగా పొడవడంతో అక్కడికక్కడే శ్రీనివాసకుమార్ మృతి చెందాడు. భర్త మృతిని ప్రమాదంగా చిత్రీకరించాలని భావించిన ఆమె తనకు పరిచయమున్న ప్రవీణ్ అనే వ్యక్తికి ఫోన్ చేసింది. ఆయన ఇంటికి రాగానే మృతదేహాన్ని మెట్లకింద ఉంచి, రక్తపు మరకలన్నింటినీ శుభ్రంచేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చే సింది. ఈ విషయమై మృతుడి అక్క రమణమ్మ నవాబుపేట పోలీ సులకు సోమవారం ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్
మంగళవారం, 5 ఆగస్టు 2025
www.andhrajyothy.com

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	107
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	222

కోడిగుడ్ల ధర (100): 475

స్క్రీనింగ్ వివరాలు అప్‌లోడ్ చేయాలి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్కాన్ సెంటర్లలో స్క్రీనింగ్ చేసిన గర్భిణీల వివరాలు పీసీపీఎన్‌డీటీ యాక్ట్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని జయభారత్, రవి చిన్నపిల్లల ఆసుపత్రుల్లోని స్కానింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. తప్పని సరిగా నిబంధనలను పాటించాలని సూచించారు. క్షయ అనుమానిత కేసులు వస్తే వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ గళ్ల కేంద్రానికి పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్షయ జిల్లా కో ఆర్డినేటర్ విజయకుమార్, పబ్లిక్, ప్రైవేట్ మిక్స్ కో ఆర్డినేటర్ హరీష్, భవ్య, తులసీరామ్, ప్రవీణ్, సరిత పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

ఈఎస్ఐ వైద్యశాల ఏర్పాటుకు చర్యలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : నగరంలో ఈఎస్ఐ వైద్యశాల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర కార్మికశాఖమంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. సోమవారం ఆయనను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కలిసి ఈఎస్ఐ వైద్యశాల పనులు పూర్తి చేయాలని కోరగా, అందుకు మంత్రిపై విధంగా సమాధానం ఇచ్చారు. కాగా జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ దేశవ్యాప్తంగా 36 సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌లను ఏర్పాట్లు చేసిందని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి చెప్పారు. ఎంపీ వేమిరెడ్డి పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు ఆయన పై సమాధానం ఇచ్చారు. అలాగే రామాయపట్నం వద్ద బీపీసీఎల్ ఏర్పాటుకు సహకరించాలని ఎంపీ వేమిరెడ్డితో పాటు పలువురు ఎంపీలు కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరిని కలసి కోరారు.

బకింగ్‌హామ్ కాలువను పునరుద్ధరించాలి : బీఎమ్మార్

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బంకింగ్ హామ్ కెనాల్ పునరుద్ధరణకు తక్షణ చర్యలు అవసరమని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ 1806లో బ్రిటీష్ వారు నిర్మించిన ఈ కాలువ వల్ల వరదల నుంచి రక్షణ, తాగునీటి సరఫరాతోపాటు రవాణాకు ఎంతగానో ఉపయోగమన్నారు. అయతే రోడ్డు మార్గాలు అభివృద్ధి చెందడంతో కాలువ వినియోగం తగ్గిపోయిందని చెప్పారు. జాతీయ జలమార్గం-4లో భాగంగా గుర్తింపు పొందినా దీని పునరుద్ధరించే దిశగా చర్యలు చేపట్టలేదన్నారు. బంకింగ్‌హామ్ కాలువకు ప్రత్యేక ప్రాధికార సంస్థ ఏర్పాటు చేయాలని, తక్షణం నిధులు మంజూరు చేసి కాలువ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కోరారు.

పోర్టు రైలుమార్గంపై ప్రస్తావన

రామాయపట్నం పోర్టుకు రైలు మార్గంపై రాజ్యసభలో మస్తాన్‌రావు ప్రశ్నించారు. స్పందించిన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నుంచి తెట్టు రైల్వే స్టేషన్ వరకు రైలు కనెక్టవిటి పనులు చేపట్టామన్నారు. అలాగే బిట్రగుంట, కావలి రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. అమృత భారత్ స్టేషన్ స్కీమ్ కింద రాష్ట్రంలో 73 స్టేషన్‌లు ఎంపికయ్యాయని చెప్పారు.

8న పౌర్ణమి ధుని పూజ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట గురునిలయంలో ఈనెల 8న పౌర్ణమి సందర్భంగా ధుని పూజ నిర్వహించనున్నట్లు మాకాని కుటుంబ సభ్యులు, స్వామి భక్త బృందం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు సాయంత్రం 6.30గం టలకు వెంకయ్య స్వామికి, మాకాని వెంకట్రావులకు సహస్ర నామపూజలు, ధుని పూజలు నిర్వహిస్తామని, భక్తులంతా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

20న భగవద్గీత కంఠస్థ పోటీలు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాష్టమి సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 20న భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు సేవా సమితి సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులంతా పాల్గొనవచ్చని తెలిపింది. విద్యార్థులను ఆహ్వానిస్తూ 21 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు ఆహ్వాన పత్రికలు పంపామన్నారు. వివరాలకు 79899 75473, 90007 56954 నంబర్లను సంప్రదించాలని సమితి పేర్కొంది.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకేడబ్ల్యూ ఫీడర్‌లో విద్యుత్ లైన్ మార్పడం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏరెక్షన్ కారణంగా ఆ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఎం శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నీలగిరి సంగం, బట్వాడీ పాళెం సెంటర్, న్యూ ఎస్పీ ఆఫీస్, పోలీస్ పెట్రోల్ బంకు, కేవీఆర్ పెట్రోల్ బంకు, కస్తూర్బా కళాక్షేత్రం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్పొరేషన్

పీజీఆర్‌ఎస్‌కి 48 వినతులు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 4,(ఆంధ్రజ్యోతి) : నగర కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కి 48 మంది తమ సమస్యలను వినతుల ద్వారా అధికారులకు విన్నవించారు. వీటిని అందుకున్న డీసీ చెన్నుడు వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని, టిడ్కో గృహాలను అందచేయాలని, పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని, రెవెన్యూ, సిటీప్లానింగ్ విభాగాల సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందాయి.

వంతెనలే పార్కింగ్ స్థలాలు!


స్టోన్‌హౌస్‌పేట పాత వంతెనపై బండ్లు


స్టోన్‌హౌస్‌పేటవైపు రాకపోకలు సాగించే వంతెనపై ఆటోస్టాండులా...?

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలో అసలే ఇరుకిరుకు రోడ్లు.. ఆపై ఆక్రమణలు, వాహనాల పార్కింగ్.. నగర రహదారులపైకి వాహనాలు తీసుకు రావాలంటేనే ట్రాఫిక్ కష్టాలతో భయం. ఈ క్రమంలో వంతెనలను పూర్తిగా పార్కింగ్ ప్రాంతాలుగా మార్చేశారు. నిత్యం వాహనాల రద్దీతో ఉంటే స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలోని రెండు పాత వంతెనలు పూర్తిగా ఆటోలు, తోపుడు బండ్లకు నిలయాలుగా మారాయి. దీంతో వాహనదారులు నూతనంగా నిర్మించిన రెండు వంతెనలపై ప్రయాణాలు చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శెట్టిగుంటరోడ్డు వద్ద నూనతంగా నిర్మించిన వంతెన లారీలు, పెద్ద వాహనాల పార్కింగ్ పాయింట్‌గా మారింది. ఇక్కడ బ్రిడ్జీ ఉందని, దానిపై వాహనాలు వెళ్ల వచ్చనే విషయం చాలా మందికి తెలియనే తెలియదు. దీంతోపాత వంతెనపై మాత్రమే వాహనాలు ప్రయాణిస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులు, పోలీసులు ఈ వంతెనల ద్వారా వాహనాలు ప్రయాణించేలా చేస్తే ట్రాఫిక్ కష్టాలు కొంత వరకైనా పరిష్కారం అవుతాయి.


శెట్టిగుంటరోడ్డు వంతెనపై పార్కు చేసి ఉన్న లారీ


వంతెనకు అడ్డంగా మట్టి కుప్పలు

శిశువులకు తల్లిపాలు తప్పనిసరి

సీడీపీవో అరుణ

కొనసాగుతున్న వారోత్సవాలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డను తప్పనిసరిగా ఇవ్వాలని అర్బన్ సీడీపీవో టీ అరుణ తెలిపారు. సోమవారం నగరంలోని రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రామకృష్ణ, డాక్టర్ జునైడ్ సిద్దికి, సీవోటీ తిరుపతయ్య, సూపర్‌వైజర్ హరిత తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న అరుణ

● పోతపాలు బిడ్డలకు అనారోగ్యం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు పోతపాలు పట్టించడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, తల్లిపాలే శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా రూరల్లోని గుడిపల్లిపాడు -2 కేంద్రంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు గంట వ్యవధిలోనే ముర్రుపాలు పట్టించడం వల్ల జీవితకాలం అవసరమైయ్యే వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందన్నారు. బాలింతలు తల్లిపాల విశిష్టతపై అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు అరుణకుమారి, నందిని, అంగన్‌వాడీ టీచర్లు విలసిని, నీరజా, హైమా, కరీమున్నీసా, షబానా, ఉషా, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.


గుడిపల్లిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

● తల్లిపాలపై అవగాహన

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణ వైద్య కళాశాల, ఆసుపత్రి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో నారాయణ అర్బన్ ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం తల్లిపాల వారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ కుమార్ మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకత గురించి వివరించారు. అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కార్తీక్ తదితరులు మాట్లాడారు. నారాయణ వైద్య విద్యాసంస్థల డీన్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి, డాక్టర్ సాంబశివారెడ్డి, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ భవ్య, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ లతిక తదితరులు పాల్గొన్నారు.

● రాజేంద్రనగర్ సచివాలయంలో..

నగరంలోని రాజేంద్రనగర్ సచివాలయంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీవో అరుణ, టీడీపీ నేతలు కలవకుంట్ల భాస్కర్, కవిత, సిద్దిక్, తిరుపతయ్య, మునిశేఖర్, సిద్ద కళాచారి, కంచికృష్ణ, నీలకంఠం మునికృష్ణ, షేక్ మాభాషా, రాధా, అన్నపూర్ణ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పోలీసు స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు అధికారులు ఆదివారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని అన్ని కూడళ్లు, హైవే ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్‌లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఆటో సైడ్ సిట్టింగ్, డిఫెక్టివ్ నంబర్ ప్లేట్స్, అనధికార పార్కింగ్‌లపై జరిమానా విధించారు. సుమారు 675 వాహనాలు తనిఖీ చేసి డ్రంక్‌అండ్ డ్రైవ్‌పై 8 కేసులు నమోదు చేసి, 6 అనధికార వాహనాలను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్‌లు చిట్టెం కోటేశ్వరరావు, వేణుగోపాల్‌రెడ్డి, దశరథ రామారావు, రోశయ్య, శ్రీనివాసరావు, సాంబశివరావులు తదితరులు పాల్గొన్నారు.


వాహనాలు తనిఖీ చేస్తున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు

30 పోలీస్ యాక్ట్ అమలు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఈ నెల 31 వరకు 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని నగర డీఎస్పీ పీ. సింధుప్రియ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా ఈ యాక్ట్‌ను అమలు చేస్తున్నామన్నారు. అనుమతులు లేకుండా సమావేశాలు, ర్యాలీలు, ప్రజలు గుమికూడటం వంటివి చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

కులదూషణ కేసులో ఆరునెలల జైలు

నెల్లూరు (లీగల్), ఆగష్టు4 (ఆంధ్రజ్యోతి) : కులం పేరుతో దూషించాడన్న కేసులో నేరం రుజువు కావడంతో చిరమన సతీష్‌రెడ్డికి ఆరు నెలలపాటు కఠిన కారాగార శిక్ష విధిస్తూ నెల్లూరు ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక న్యాయాధికారి ఎన్.సరస్వతి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కేసు వివరాలు ఇలా ఉన్నాయి. తోటపల్లి గూడూరు మండలం కొత్తపాళెంకి చెందిన పోట్లూరు వెంకటశేషయ్య తన పొలంతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని రొయ్యల గుంటలు వేశాడు. అందులో రొయ్యలను 2017 ఏప్రిల్ 8న పట్టాడు. అనంతరం ఆ రొయ్యలను చిరమన సతీష్‌రెడ్డికి రూ.11,91,549లకు అమ్మాడు. ఆ సమయంలో సతీష్‌రెడ్డి, వెంకట శేషయ్యకు రూ. 25వేలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. మిగతా పైకం విషయమై వెంకటశేషయ్య పెద్ద చెరుకూరులోని సిరి గార్డెన్స్‌లో నివాసం ఉంటున్న సతీష్‌రెడ్డి ఇంటికి 2017 జూన్ 8న వెళ్లి అడిగాడు. డబ్బు ఇవ్వకపోగా శేషయ్యను కులం పేరుతో దూషించాడు. ఈ మేరకు నెల్లూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణ కాలంలో నేరం రుజువు కావడంతో న్యాయాధికారి నిందితుడికి పైవిధంగా జైలుశిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అజయ్ ప్రేమ్‌కుమార్ లామ్ వాదించారు.

సింగిల్ నెంబర్లాట జూదరుల అరెస్టు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డైకాస్‌రోడ్డు సమీపాన ఉన్న ఎన్‌సీసీ కాలనీలోని ఖాళీ ప్లాట్లలో సింగిల్ నెంబర్లాట ఆడుతున్న పలువురిని వేదాయపాలెం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు, సోమవారం మధ్యాహ్నం వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తమ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఎన్‌సీసీ కాలనీ మొదటి వీధిలో వెళుతున్నారు. పోలీసు సైరన్ విని కొందరు వ్యక్తులు పరుగులు తీశారు. వారిలో ఇద్దరిని పట్టుకొని విచారించగా సింగల్ నెంబర్లాట ఆడుతున్నామని అంగీకరించారు దీంతో ఆళ్ల చిన్నకొండయ్య, అన్నవరపు హనుమంతు యాదవ్, షేక్ మస్తాన్, సంత క్రిష్ణమూర్తి, చిల్లకూరు సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర నేవల్ యూనిట్-10 విభాగం ఎన్‌సీసీ కేడెట్స్‌కు నగరంలోని వెంగళరావునగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సెకండ్ ఆఫీసర్ జీ.నరేంద్రబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి కూడా తమ రక్త గ్రూపుతో పాటు రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందచేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మోటివేటర్ మధుసూదన్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం భూషణ్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చూడండి : కలెక్టర్

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కీలక జనిత వ్యాధులపై జరిగిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మలేరియా, చికెన్‌గున్యా, డెంగ్యూ వంటి వ్యాధుల బానిప సడరేండా వైద్య ఆరోగ్య శాఖ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ కేంద్రాలలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. వారంలో ఒకరోజు పారిశుధ్య చర్యలు చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలియచేశారు. వసతి గృహాలలో చిన్నారులకు జ్వరాలు వస్తే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సుజాత, మలేరియా అధికారి హుస్సేనమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన డీఎంహెచ్‌వో సుజాత

క్రీడా సంఘాలకు ప్రోత్సాహక పత్రాలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి) : స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలకు క్రీడాకారులకు అందించే ప్రశంసాపత్రాలను, ఇకపై క్రీడా సంఘాలకు కూడా ప్రభుత్వం అందచేయనున్నదని జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి తెలిపారు. నగరంలోని శాంతినగర్‌లో ఉన్న తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న తీరులోనే ఇకపై క్రీడా సంఘాలకు కూడా ప్రోత్సాహం ఉండేలా కలెక్టర్ ఆనంద్ నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాసంఘాలకు అవార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరిన వెంటనే ఆయన స్పందించి డీఎస్ఏకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ప్రతి క్రీడా సంఘం కూడా శాప్ గుర్తింపు పొంది ఉండాలని, వారు మాత్రమే ఈ అవార్డులకు అర్హులని ఉత్తర్వుల్లో తెలిపారన్నారు. దరఖాస్తు చేసుకున్న సంఘాలకు మూడు కేటగిరిల్లో అవార్డులు అందచేస్తారని, అంతర్జాతీయ, జాతీయస్థాయిల్లో పతకాలు సాధించన సంఘానికి, జాతీయ, రాష్ట్ర పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారుల అసోసియేషన్‌కు, శిక్షణాశిబిరాలు, ఉత్తమ శిక్షణ, అవగాహన తరగతులు తదితర అంశాలపై మరో కేటగిరిలో సంఘానికి ప్రశంసాపత్రాలు ఉంటా యన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలో గుర్తింపు పొందిన క్రీడా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

రైతు సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లూరు(వెంకటేశ్వరపురం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైసీపీ ఎమ్మెల్సీలు పీ చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్ కోరారు. కలెక్టరేట్ పీజీఆర్ ఎస్‌లో ఈ మేరకు వారు జేసీ కార్తీక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు దొరకడం లేదని తెలిపారు.రైతు భరోసా కింద రూ. 20 వేలు అందజేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం రూ.5వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నదన్నారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి,కాకాణి పూజిత, కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు.


జేసీ కార్తీక్‌కు వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

జగన్‌తో ఎమ్మెల్సీ భేటీ

వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డితో ఎమ్మెల్సీ పీ చంద్రశేఖర్ రెడ్డి భేటీ అయ్యారు. సోమవారం తాడేపల్లిలోని జగన్ నివాసంలో ఆయనతో సమావేశమై జిల్లా రాజకీయాలపై చర్చించారు. జిల్లాలో అందరినీ కలుపుకుని పార్టీని బలోపేతం చేయాలని జగన్ ఆయనకు సూచించారు.

ముగిసిన వార్షిక వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గణేష్ సేవా మిత్ర మండలి 20వ వార్షిక వేడుకలు సోమవారం ముగిశాయి. ఐదురోజులపాటు జరిగిన ఈ కార్యక్రమాల్లో చివరిరోజు సామాజిక పించన్లను ముగ్గురికి అందజేశారు. గత 19 సంవత్సరాలుగా సేవా మిత్రమండలి సేవా కార్యాక్రమాలకు సహకరించిన దాతలందరికీ మండలి అధ్యక్షుడు గాలి శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండలి సభ్యులు కోవూరు రాజేష్, రాజశేఖర్, సాయికార్తీక్, దండి సుమన్, పరంధామయ్య, ప్రసాద్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కలిసిపనిచేద్దాం

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, ఆగస్టు 4,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లో గ్రామాల అభివృద్ధికి అంతా కలిసి రావాలని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పాతవెల్లంటి గ్రామ అరుంధతీవాడలో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పార్టీల సిద్ధాంతాలు, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయంలోనే చూపాలన్నారు. మిగిలినప్పుడు అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని కోరారు. నెల్లూరురూరల్ నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా ఏ పని అడిగినా వెంటనే సీఎం చంద్రబాబు అనుమతులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, పముజుల ప్రదీప్, అల్లాభక్షు, మురళీ రెడ్డిలు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు గుంజ ప్రతిష్ఠ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బెజవాడ గోపాలరెడ్డి సర్కిల్‌లో లంబోదర ఉత్సవ కమిటీ గణేష్ ఉత్సవాలకుగాను సోమవారం గుంజ ప్రతిష్ఠ నిర్వహించింది. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. గణేష్ ఉత్సవాలు పనులను ప్రారంభిం చినట్లు కమిటీ తెలిపింది.

చేనేత దినోత్సవ నిర్వహణపై సమావేశం

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 7న నిర్వహించనున్న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహణపై జిల్లా చేనేత కమిటీ నాయకులతో చేనేత, జౌళి శాఖ ఏడీ శ్రీనివాసులరెడ్డి సోమవారం ఆయన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆరోజు ఉదయం గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించి, నగరంలో భారీ ర్యాలీ నిర్వహించాలని, కలెక్టరేట్‌లో చేనేత స్టాల్ ఏర్పాటు చేయాలని, చేనేత రంగంలో దీర్ఘకాలం పనిచేసిన నాయకులను, కార్మికులను సన్మానించాలనే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, పద్మశాలి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహస్వామి, నాయకులు చింతలపూడి పెంచలయ్య, వెంకయ్య, ఆశం సురేష్, జానపాటి రామసుబ్బయ్య, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఏడీని సన్మానించారు.


ఏడీ శ్రీనివాసులరెడ్డిని సన్మానిస్తున్న చేనేత కమిటీ నాయకులు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తొలగించాలి

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య



నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మన పరిసరాల్లోని సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సమష్టి కృషితో తొలగించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ పీ.కృష్ణయ్య కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో ఆయన జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబరు 2 నాటికి జిల్లాలో సింగిల్ యూజప్ ప్లాస్టిక్‌ను పూర్తిగా తొలగించాలని, ఇది ముఖ్యమంత్రి ఆశయమని తెలిపారు. అందుకు అనుగుణంగా అధికారులంతా పనిచేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ రోజూవారి సరుకులుకొని తెచ్చుకునేందుకు వస్త్ర సంచుల వాడకం అలవాటు చేసుకోవాలని కోరారు. జిల్లాలో ప్లాస్టిక్ సంచుల తయారీకి అనుమతులు లేవన్నారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి ప్లాస్టిక్ సంచులు దిగుమతులను వివిధ చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేయాలన్నారు. హోల్‌సేల్ వ్యాపారం జరిగే ప్రదేశాల్లో ప్లాస్టిక్ సంచులు విక్రయాన్ని నియంత్రించేందుకు దాడులు చేయాలన్నారు. ఇందుకు ప్రత్యేకంగా జిల్లాలో మల్టీ డిపార్ట్‌మెంట్ టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో శ్రీధర్‌రెడ్డి, డీటీసీ చందర్, డీఎస్‌వో విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి శబరి శ్రీరామక్షేత్రం వార్షికోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రం 25వ వార్షికోత్సవాలు ఈనెల 7, 8తేదీల్లో జరగున్నాయి. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు మందిరం ఛైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వతేదీ ఉదయం లక్ష తులసీదళ అర్చన, రాత్రి సీతారామ కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 8న ఉదయం 8.30గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం జరుగుతుందని, భక్తులందరూ తరలిరావాలని ఆయన కోరారు.

డీఐఈవోగా కృష్ణారెడ్డి

నెల్లూరు (విద్య), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇంటర్‌బోర్డు విద్యాశాఖ ఇన్‌చార్జి అధికారిగా (డీఐఈవో) బీవీ.కృష్ణారెడ్డి నియమితులయ్యారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై నెల్లూరు జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని డీఐఈఓ కార్యాలయంలో కృష్ణారెడ్డిని అధ్యాపకులు పాటూరు వేణుగోపాల్ రెడ్డి, బి.బసివిరెడ్డి, బాలసుబ్బారెడ్డి తదితరులు సత్కరించి అభినందించారు.



కృష్ణారెడ్డికి అభినందనలు తెలుపుతున్న అధ్యాపకులు



పెళ్లిపై అవగాహనకు కేంద్రం

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : యువత వివాహానికి ముందు భావోద్వేగాలు, ఆచారాలు, ఆరోగ్యం వంటి అంశాల్లో అవగాహన లేకుండా సమస్యలు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ ఆనంద్ అన్నారు. పెళ్లిపై యువతకు అవగాహన కోసం నగరంలోని సఖి వన్ స్టాప్ సెంటర్‌లో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పా టు చేశారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరే ట్‌లోని తిక్కన భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లా డుతూ ప్రీ మెరిటల్ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా వివాహ సంబంధ సమస్యలపై ముందు జాగ్రత్తగా మార్గదర్శనం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, వన్‌స్టాప్ అడ్మిన్ ఎస్‌కే షహనాజ్, న్యాయ సలహాదారులు ఎన్.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



లింగ సముద్రంలో వేసిన వెంచర్

లింగసముద్రంలో రియల్ భూం

- పరిశ్రమలు వస్తాయని భూముల ధరకు రెక్కలు
- ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కన వెలుస్తున్న లేఅవుట్లు

లింగసముద్రం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం మండలంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. మండలంలోని తిమ్మారెడ్డిపాలెం, యర్రారెడ్డిపాలెం, లింగసముద్రం, ఆర్‌ఆర్ పాలెం గ్రామాల్లోని అటవీ ప్రాంతాల్లో జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో ఇనుప ఖనిజ నిక్షేపాల కోసం తవ్వకాలు జరుగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు వస్తాయని భావించి రియల్టర్లు మండలంలోని పలు గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కనే ఉన్న వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వ్యవసాయేతర భూములుగా మార్చి వెంచర్లు వేస్తున్నారు. ఒంగోలు, కావలి, కందుకూరు పట్టణాలకు చెందిన కొందరు రియల్టర్లు, మండల కేంద్రమైన లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం, చినపవని, పెదపవని గ్రామాలకు చెందిన పలువురు రియల్టర్లు, లింగసముద్రం, చినపవని, పెదపవని గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ భూములను ఒక ఎకరా నుంచి 5 ఎకరాల వరకు కొనుగోలు చేసి, వాటిని వ్యవసాయేతర భూములుగా మార్చి ఆగమేఘాలపై వెంచర్లు వేశారు. ఎకరా భూమిని రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లకు కొనుగోలు చేసి, వెంచర్లు వేసి, వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. లింగసముద్రంలో వేసిన కొన్ని వెంచర్లలో ఒక్క సెంటు స్థలం ఖరీదు రూ.4 లక్షలు వరకు పలుకుతోంది. దీంతో ఆ వెంచర్‌లో వేసిన రెండున్నర సెంట్లు స్థలం ఉన్న ప్లాట్లు రూ.10 లక్షలకు హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. అలాగే మరో వెంచర్‌లో ఒక సెంటు స్థలం రూ.10 లక్షల వర కు ధర చెబుతున్నట్టు కొనుగోలుదారులు చెబుతున్నారు. ఇక లింగసముద్రంతో పాటు, పెదపవనిలో కూడా సెంటు స్థలం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ధర చెబుతున్నట్లు తెలిసింది. చినపవనిలో కొత్తగా 8 ఎకరాల్లో కొత్తగా ఒక లేఅవుట్ వేస్తున్నారు. ఇలా రియల్టర్లు భూముల కొనుగోలుపై దృష్టి సారించడంతో లింగసముద్రం ప్రాంతంలో రియల్ భూం పరుగులు తీస్తోంది.

రికార్డు స్థాయిలో అర్జీలు

- కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కి 566 వినతులు
- వాటిలో రెవెన్యూ శాఖవే 205

నెల్లూరు(హరథపురం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కి సోమవారం రికార్డు స్థాయిలో 566 అర్జీలు అందాయి. వాటిలో 205 వినతులు రెవెన్యూశాఖవే. ఇంత పెద్ద సంఖ్యలో అర్జీలు అందుతాయని అధికారులు కూడా భావించలేదు. ఉచిత భోజనం, కూర్చోడానికి సౌకర్యాల ఏర్పాటుతో అర్జీదారులు పెరిగారని తెలుస్తోంది. కలెక్టర్ ఆనంద్ అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులను పిలిచి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

● దళిత సంఘర్షణ సమితి నిరసన

ఒకే కుటుంబానికి 21 ఎకరాలు రహదారి పక్కన ఇచ్చారని ఆరోపిస్తూ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. 2014లో తహసీల్దార్ కావలి రూరల్ మండలం రుద్రకోటకి చెందిన గోపి కుటుంబానికి 21 ఎకరాలు ఇచ్చారని, అలా ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. నిరసన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జరుగుమల్లి కోటయ్య, చలంచర్ల, లక్ష్మయ్య, పోలయ్య, యానాది సంఘం జిల్లా అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ పాల్గొన్నారు.

● డ్రైవర్ల సంఘానికి ఎన్నికల నిర్వహించాలి

ప్రభుత్వ డ్రైవర్ల సంఘానికి ప్రత్యేక ప్రభుత్వ అధికారిని నియమించి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వ డ్రైవర్లు పీ ప్రసాద్, వీ రమణయ్య తదితరులు వినతిపత్రం సమర్పించారు. తక్షణమే ఎన్నికలు జరపాలని కోరారు.

● జెండా పండుగకు ఏర్పాట్లు చేయాలి

స్వాతంత్ర్య వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవనలో ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన విధులను వారు బాధ్యతగా నిర్వహించాలన్నారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలతోపాటు జిల్లాలోని అన్నీ విద్యాసంస్థల్లో పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

● పీ-4పై అవగాహన చేసుకోవాలి..

పీ-4 పథకాన్ని అధికారులు అవగాహన చేసుకుని మార్గదర్శులను పెంచాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. పీ-4పై తిక్కన భవన్‌లో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఈ పథకంపై విస్తృతంగా చర్చ జరపాలన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

● జీఎస్టీ రిజిస్ట్రేషన్లు పెంచాలి



అర్జీదారుడి సమస్య వింటున్న కలెక్టర్ ఆనంద్

జిల్లాలో జీఎస్టీ రిజిస్ట్రేషన్లు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం వాణిజ్యపన్నుల శాఖ, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువిలువ రూ.40లక్షలు, సేవల విలువ రూ.30లక్షలు దాటిన వ్యాపార సంస్థలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు రవాణా, మైనింగ్‌శాఖలు వాణిజ్యపన్నుల శాఖతో సమన్వయంతో ఉండాలన్నారు. ఈ సమావేశంలో వాణిజ్య పన్నులశాఖ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే పిల్లలు పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి : ఏఎస్పీ


నెల్లూరు(క్రైం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 84 మంది సమస్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. నగర డీఎస్పీ సింధుప్రియ, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కేసీహెచ్ రామారావులు ఫిర్యాదులు స్వీకరించారు. అందిన ఫిర్యాదుల్లో కొన్ని...

- కావలికి చెందిన ఓ వ్యక్తి ఇంటిపై సోలార్ ప్యానల్స్ బిగిస్తానని కోవూరుకి చెందిన ప్రవీణ్‌కుమార్ రూ.2.46 లక్షలు తీసుకున్నాడు. ప్యానల్స్ బిగించక పోగా నగదు తిరిగి ఇవ్వమంటే బెదిరిస్తున్నాడని బాధితుడు పేర్కొన్నారు.
- మర్రిపాడుకి చెందిన ఓ వ్యక్తికి, వింజమూరుకి చెందిన ఓ మహిళకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని కలువాయికి చెందిన సంధ్య అనే మహిళ నమ్మించి వారి నుంచి రూ.5 లక్షలు తీసుకుంది. ఉద్యోగాలు ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తోందని బాధితులు ఫిర్యాదు చేశారు.
- వెంకటాచలానికి చెందిన రైతుల నుంచి రూ.29 లక్షల విలువ చేసే పంట దిగుబడిని దళారి మునికృష్ణయ్య తీసుకెళ్లాడు. అయితే ఇప్పటివరకు బకాయిలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని, న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న నగర డీఎస్పీ సింధుప్రియ

సమరం సాహిత్యం రాజకీయం బెగోరె



- నేటి యువతరానికి స్ఫూర్తి బెజవాడ గోపాల్‌రెడ్డి
- స్వాతంత్ర్య సమరయోధుడిగా పలుమార్లు జైలుకు..
- ఎన్నో పదవులకు వన్నెతెచ్చిన రాజకీయ చాణుక్యుడు
- సాహితీవేత్తగా కూడా రాణింపు
- నేడు గోపాల్‌రెడ్డి జయంతి

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు, సింహపురి ముద్దుబిడ్డ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి (బెగోరె) వివిధ పదవుల్లో పనిచేసి రాజకీయ చాణుక్యుడిగా పేరుగాంచారు. సాహిత్యంలోనూ కూడా ఆయన రాణించారు. ఆయన 1907 ఆగస్టు 5న బుచ్చిరెడ్డిపాలెంలోని జమీందారీ కుటుంబీకులైన బెజవాడ పట్టాభిరామిరెడ్డి, సీతమ్మ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం బుచ్చి, నెల్లూరు, గుంటూరులోని ఆంధ్రా జాతీయ కళాశాల (1921-24), కలకత్తాలోని విశ్వభారతి విద్యాలయాల్లో (1924-27) సాగింది. జరిగింది. చదువు పూర్తవగానే స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. ఆరుసార్లు జైలు శిక్ష అనుభవించారు. 1930, 31, 32, 33, 1940, 41, 42, 43 సంవత్సరాల్లో జైలు జీవితం గడిపారు. జైలులో ఏ, బీ, సీ క్లాస్ ఖైదీగా, డెటిన్యూగా గడిపారు. దేశభక్తి, క్రమశిక్షణ ఆయన రెండు కళ్లు. నెల్లూరు జిల్లా నుంచి జాతీయ నాయకుడిగా ఎదిగిన జననేత ఆయన. మంత్రిగా ఉమ్మడి మద్రాసు రాష్ట్రం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ పనిచేశారు. కేంద్ర మంత్రిగా కూడా కొంతకాలం పనిచేశారు. ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా ఐదేళ్లు పనిచేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రో చాన్సలర్‌గా జూన్ 1951 నుంచి 1957 వరకు పనిచేశారు. ఏ పదవిలో ఉన్నా ఆయన ఆ పదవికి వన్నె తెచ్చారు. మంత్రిగా ఆయా శాఖల్లో సంస్కరణలు తీసుకువచ్చారు.

● వివిధ పదవుల అలంకరణ

ఆయన 1955లో ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1956లో విశాలాంధ్ర ఏర్పడినప్పుడు ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. ప్రధాని నెహ్రూ హయాంలో కేంద్రంలో రెవెన్యూ, సమాచార ప్రసార శాఖల మంత్రిగా పనిచేసి ఆ శాఖలకు వన్నె తెచ్చారు. 90 ఏళ్ల నిండు జీవితాన్ని గడిపిన బెజవాడ గోపాలరెడ్డిని నేటితరం రాజకీయ వేత్తలు, సాహితీవేత్తలు ఆదర్శంగా తీసుకోవాలి. కాగా 90వ జన్మదినం సందర్భంగా 1996లో జరిగిన అభినందన సభలో ఆయన జీవిత విశేషాలతో లాయర్ పత్రిక 'బతుకంతా బృందావనమే' ప్రత్యేక సంచికను ఆవిష్కరించింది. అనాడు జరిగిన సభలో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, మాగుంట పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● తెలుగుభాష అభివృద్ధికి కృషి

తెలుగు భాషాభిమానిగా, మాతృభాష అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిది. 1948 నుంచి తెలుగు భాషా సమితి అధ్యక్షుడిగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా 1957 ఆగస్టు నుంచి 1982 డిసెంబరు వరకు పనిచేశారు. ఆయన కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా పని చేసిన సమయంలోనే తెలుగుభాషకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. తెలుగు జ్ఞానపీఠంకు 1963 నుంచి 1971 వరకు అధ్యక్షుడిగా పనిచేసి ఎన్నో సాహితీ సభలు నిర్వహించారు.


● రచయిత కూడా..

రచయితగా ఆయన రచనలు చేయడమేకాక, ఎన్నో సాహిత్య సభలు నిర్వహించారు. ఎందరో సాహితీవేత్తలు, కవులతోపాటు నాటకాలు, చలన చిత్ర కళాకారులను ఆయన సత్కరించారు. కళా పోషకుడిగా ఆయన గుర్తిండిపోయారు. రచయితగా 13 రచనలు, అనువాదకుడిగా 10 పుస్తకాలు రాశారు.

● రాసిన పుస్తకాలు...

ఆమె పంచకము పేరున ఆమె (1978), ఆమె జాడలు(1981), ఆమె నీడలు(1981), ఆమె తళుకులు (1982) ఆమె చెణుకులు (1982), స్వలింగాలు-తుషారాలు(1984), స్వపనహారం (1986), ఆయన రచించిన శతకవితలు, కాలవాహిని (1979), సాహిత్య సుందరి (1980), ప్రసూన మంజిరి (1981), పరిమళ తరంగాలు (1982), సాగర సమీరాలు(1983), మలయ మారుతాలు (1985) వంటి పుస్తకాలు ఎంతో ప్రజాదరణ పొందాయి. గోపాల్‌రెడ్డి విశ్వకవి రవీంద్రనాథుడి రచనలను తెలుగులోకి అనువధించి సాహితీ ప్రియులకు అందించారు. రవీంద్రుడి నాటికలు, 5 సంపుటాల కథలు, కల్పనలు, వాన చినుకులు, ఊర్వశి కాళిదాసు, నైవేద్యం, స్మరణ, తాజ్ మహల్, ఇక్బాల్ ఫిర్యాదులు, జవాబు, కొన్ని ఉర్దూ కవితలను కూడా తెలుగులోకి అనువదించారు. ఆయన తన 70వ ఏట నుంచి రచనలు ప్రారంభించారు. సాహిత్యంలో లోతు పాతులు తెలుసుకున్నారు.

పాద ముద్రలు



సాహిత్య సభలో ప్రసంగిస్తున్న బెజవాడ గోపాల్‌రెడ్డి



సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావుకు నటసామ్రాట్ బిరుదును ప్రదానం చేస్తున్న బెగోరె

అధిక ధరలకు యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు

- డీలర్లకు వింజమూరు ఏడీఏ శేషగిరి హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జలదంకి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వింజమూరు ఏడీఏ శేషగిరి హెచ్చరించారు. గత శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'బ్లాక్‌లో యూరియా కథనానికి వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమ వారం మండల వ్యవసాధికారి శ్రీవాణితో కలసి మండలంలోని ఎరువులు, పురుగు మందుల డీలర్లతో స్థానిక రైతుసేవా కేంద్రంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ యూరియా అధిక ధరలకు ఎందుకు విక్రయిస్తున్నారని డీలర్లను ప్రశ్నించారు. యూరియా కంపెనీలు, హోల్‌సేల్ డీలర్లు తమకు సరఫరా చేసే ధర ఆధారంగానే తాము విక్రయిస్తున్నామని, దీనిలో రైతులతో నిందలు పడడం తప్ప మాకెలాంటి లాభం లేదని పేర్కొన్నట్లు సమాచారం. ఈ విషయాన్ని డీఏవో దృష్టికి తీసుకువెళ్తానని, ఇకపై ఎవరూ అధిక ధరలకు యూరియా విక్రయించకూడదని హెచ్చరించారు. ఇకపై అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు రైతులు ఫిర్యాదు చేసినా, మీడియాలో వార్తలు వచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



డీలర్లతో సమావేశమైన ఏడీఏ శేషగిరి, ఏవో శ్రీవాణి

ఆయిల్, గ్యాస్ నిక్షేపాల సర్వేకు సహకరించండి

అడ్వంట్ కంపెనీ పీఆర్వో సుధీర్

కావలి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): భూగర్భంలో ఆయిల్, గ్యాస్ నిక్షేపాల కోసం మిషన్ అన్వేషణ్ పేరుతో క్షేత్రస్థాయిలో ఓఎన్‌జీసీ వారు చేపడుతున్న సర్వేకు రైతులు, ప్రజలు, మండల తహసీల్దార్లు సహకరించాలని అడ్వంట్ కంపెనీ పీఆర్వో దూడల సుధీర్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీ కృష్ణను కలిసి వినతిపత్రం అందచేశారు. భూగర్భంలో ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయనే ఉద్దేశంతో ఓఎన్‌జీసీ ఆదేశాల మేరకు జిల్లాలోని తీరప్రాంత మండలాల్లో సర్వే నిర్వహిస్తున్నారన్నారు. కావలి డివిజన్‌లోని కావలి, అల్లూరు, దగదర్తి, బోగోలు, విడవలూరు, కొడవలూరు, జలదంకి, కలిగిరి, వింజమూరు, దుత్తలూరు మండలాల్లో ఆయిల్ నిక్షేపాల కోసం ఓఎన్‌జీసీ అధికారులు, సిబ్బంది సర్వే చేస్తున్నారన్నారు. ఈ సర్వేకు అందరూ సహకరించేలా చూడాలని ఆయన ఆర్డీవోను కోరారు.

ఆల్తూరుపాడుపై ఆశలు

- ప్రాధాన్యతా ప్రాజెక్టుల జాబితాలో చోటు
- రూ.733 కోట్లతో రివైజ్డ్ ప్రతిపాదనలు
- ముఖ్యమంత్రి హామీ.. ఆర్థిక శాఖకు చేరిన ఫైల్

నెల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కండలేరు నుంచి సోమశిల - స్వర్ణముఖి లింక్ కెనాల్ ద్వారా వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు అందించే లక్ష్యంగా పదిహేనేళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ పనులు మొదలుపెట్టారు. అయితే అటవీ అనుమతులు రాకపోవడంతో కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టు నిలిచిపోయాయి. ఈ క్రమంలో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కొత్త ఆలోచన చేసింది. మేర్లపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి డక్కిలి మండలం ఆల్తూరుపాడు వరకు కాలువ నిర్మాణం జరిగింది కాబట్టి ఎస్ఎస్‌జీ కెనాల్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కండలేరు నీటిని ఆల్తూరుపాడు చెరువుకు తరలించి అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాలకు నీటి సరఫరా చేయాలని భావించింది. ఈ క్రమంలో ఆల్తూరుపాడు చెరువును 1 టీఎంసీ సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చాలని నిర్ణయించింది. 2018లో సుమారు రూ.280 కోట్ల అంచనాలతో టెండర్లు పిలవగా, అప్పటి టీడీపీ ప్రభుత్వం పనులు మొదలుపెట్టింది. ఆర్‌కేఎన్ ప్రాజెక్ట్స్ సంస్థ దాదాపు రూ.10 కోట్ల మేర పనులు కూడా చేసింది.

● వైసీపీ కక్షకు బలి

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కక్ష గట్టినట్లు ఆల్తూరుపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణ పనులను రద్దు చేసింది. 2019, నవంబరులో రివర్స్ టెండరింగ్ విధానంలో మళ్లీ టెండర్లు పిలిచింది. కడప జిల్లాకు చెందిన ఓ సంస్థ 25.73 శాతం లెస్‌కు దక్కించుకుంది. అయితే ఆ తర్వాత పనుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎస్ఎస్ఎల్‌సీ ప్యాకేజీ 17 కింద ఆల్తూరుపాడు నుంచి మేర్లపాక వరకూ కాలువ నిర్మాణం 90 శాతం వరకూ పూర్తయింది. ఇందుకు రూ.150 కోట్ల వరకూ ఖర్చు చేశారు. అయితే ఆల్తూరుపాడును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చకపోతే ఈ కాలువ నిర్మాణం చేపట్టి కూడా వృథా అవుతుంది.

● రూ.733 కోట్లతో రివైజ్ ఎస్టిమేషన్లు

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఆల్తూరుపాడు ప్రాజెక్టులో కదలిక వచ్చింది. ఆల్తూరుపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రాధాన్యతా ప్రాజెక్టుల జాబితాలోకి చేర్చింది. ఇటీవల కలెక్టర్ల సదస్సులో కూడా సీఎం చంద్రబాబు ఈ ప్రాజెక్టుపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వ ఆదేశాలతో తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులు తాజాగా రివైజ్డ్ ఎస్టిమేషన్లు పంపారు. గతంలోనే రూ.300 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసి ఉండగా, తాజా ఎస్టిమేషన్ల ప్రకారం ప్రాజెక్టు విలువ రూ.733 కోట్లకు చేరుకుంది. ఇందులో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం ఖర్చు రూ.459 కోట్లు ఉండగా, మిగిలినది జీఎస్టీ, భూసేకరణ వంటివి ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఫైల్ ఇరిగేషన్ శాఖను దాటి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వద్దకు చేరిందని, త్వరలోనే పరిపాలనా అనుమతులు మంజూరయ్యే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు. కాగా దీనిపై టీజీపీ ఈఈ రాధాకృష్ణమూర్తి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడు తూ ఆల్తూరుపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వ ఆదేశాలతో రివైజ్ అంచనాలు పంపినట్లు చెప్పారు.

ఆత్మకూరులో ఆధార్ కేంద్రాల ఏర్పాటు

ఆత్మకూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని ఇరిగేషన్ సచివాలయంలో సోమవారం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మరో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆధార్ కేంద్రంలో తప్పుల సవరణలు, నమోదు, మొబైల్ లింక్ తదితర ఆధార్‌కు సంబంధించి అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9589
వెండి కిలో ధర	రూ. 115200
వెండి ఒక గ్రాము	రూ. 118.20



'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తు చేసుకోవాలి

● అనీల్‌కుమార్, తహసీల్దారు

మర్రిపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైతు మరణిస్తే అతని కుటుంబ సభ్యులు అన్నదాత సుఖీభవ పథకం నగదును పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు అనీల్ కుమార్ తెలిపారు.

? మరణించిన రైతుల వివరాలు ఏమైనా సేకరించారా.

! మండలంలో 806 మంది రైతులు మరణించినట్లు మా దృష్టికి వచ్చింది. ఆ జాబితాను ప్రతీ సచివాలయంలోని నోటీసు బోర్డులో ఏర్పాటు చేశాం.

? వారసులు తమ పేరుతో మార్చుకునేందుకు ఏ పత్రాలు సమర్పించాలి.

! భూమికి సంబంధించిన పత్రాలతో పాటు మరణ ధ్రువీకరణ పత్రం, ప్యామిలీ మెంబర్, కుటుంబ భాగపంపకాల దస్త్రములు తీసుకొని, సచివాలయంలో మ్యుటేషన్ కోసం చలానాకట్టి సంబంధిత విఆర్‌వోకి అందజేయాలి.

? ఎప్పటిలోపు దరఖాస్తు ఇవ్వాలి.

! నిర్ణీత గడువు ఏమీ లేదు. త్వరగా అందిస్తే పథకం నగదును పొందేందుకు అవకాశం ఉంది.

న్యూస్ బాక్స్

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సతీసమేత వీరబ్రహ్మేంద్రస్వామి

ఆత్మకూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పల్లకి సేవలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం మర్రిపాడు క్లస్టర్ రైతులు 476 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని, 330 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 146 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 159 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం

ఆత్మకూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అలఘునాథస్వామి ఆలయంలో మంగళ వారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్న పుష్కర మహోత్సవ మహా కుంభాభిషేకం ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సామూహిక విష్ణు సహస్ర నామం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారు. బుధవారం అష్టోత్తర శత కలశాభిషేకం, హోమం, గురువారం మహా కుంభాభిషేకం నిర్వహించి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భక్తులకు కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6గంటలకు దేవేరుల గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

దుత్తలూరు (ఉదయగిరి), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తున్నాయని కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుల సారథ్యంలో రైతులకు సబ్సిడీపై విత్తనాల నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల వరకు పంపిణీ చేయడంతోపాటు పంటలకు పెట్టుబడి సాయం కింద నగదు అందించడం అభినందనీయమన్నారు.

శిథిలావస్థలో వంతెన

● పొంచిఉన్న ప్రమాదం ● వాహనదారుల అవస్థలు



రక్షణ కమ్మలు దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న కాలువ వంతెన

సంగం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సంగం పెన్నానది పాత ఆనకట్టకు దక్షిణ వైపు పెన్నానది నుంచి నెల్లూరు చెరువుకు నీటిని తరలించే కాలువపై ఉన్న వంతెన రక్షణ (కవచం) కమ్మలు దెబ్బతిని శిథిలావస్థకు చేరడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. పెన్నా నదికి దక్షిణం వైపు ఉన్న సూరాయపాళెం, మాముడూరు, ఎర్రబల్లి, నడిగడ్డ అగ్రహారం గ్రామస్థులు మండల కేంద్రమైన పొదలకూరు వెళ్లాలన్నా, ఇటు సంగం రావాలన్నా రక్షణ కమ్మలులేని వంతెనపైనే ప్రయాణం చేయాలి. అంతేకాకుండా గతంలో కాలువకు నీటి విడుదల చేసే రెగ్యులేటర్లు కూడా ఉన్నాయి. ఈ రెగ్యులేటర్ల నిర్వహణకు వంతెన పక్కనే పెద్ద సందులు ఉన్నాయి. వంతెనకు ఒక వైపు రక్షణ కమ్మలు శిథిలమై ఉండడంతో రాత్రివేళల్లో వేగంగా వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సూరాయపాళెం నుంచి వచ్చే ఇసుక టిప్పర్లు సైతం ఈవంతెన మీదనే రావాల్సి ఉంది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి వంతెన రక్షణ కమ్మలను పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల నిరసన



నిరసన తెలియచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

అనంతసాగరం ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీయస్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు నిరసన తెలిపారు. 2జీ ఫోన్లు ఇవ్వడంతో యాప్‌లు పనిచేయడం లేదని, తమకు పనిభారం తగ్గించాలని కోరుతూ ఫోన్లు అధికారులకు తిరిగి ఇచ్చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తరగతుల విలీనంపై ఆందోళన



ఆందోళన చేస్తున్నవిద్యార్థులు, తల్లిదండ్రులు

సంగం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో దువ్వూరులోని హరిజనవాడ పాఠశాల తరగతులను మెయిన్ పాఠశాలలో విలీనం చేయవద్దంటూ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. మెయిన్ పాఠశాలకు వెళ్లటానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, తమ పాఠశాలలోనే తరగతులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆమేరకు తహసీల్దారు సోమ్లానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపి నాయకులు శ్రీనివాసులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



పొనుగోడులో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ఏఎస్ పేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధనసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక పొదలకూరు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పొనుగోడుతాతిరెడ్డిపల్లి, రాజవోలు తదితర గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత, కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జి పెంచలనరసయ్య, సభ్యులు బి కిష్టయ్య, ఇ శేషాద్రి, ఇ పద్దమ్మ, టి నరసారెడ్డి, టీ కల్పన, టీ భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కదాడిలో 10 పశువులకు గాయాలు



గాయపడిన ఆవుదూడకు టీకా వేస్తున్న సిబ్బంది

మర్రిపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటినాయుడు పల్లిలో సోమవారం ఓ పిచ్చికుక్క దాడి చేయడంతో పది పశువులకు గాయాలయ్యాయి. రైతులు స్థానిక పశువైద్యాధికారి (ఏడి) జయచంద్రకు సమాచారం ఇవ్వడంతో సంచార పశువైద్య వాహన సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి గాయపడిన పశువులకు యాంటి రేబిస్ టీకాలు వేసి ప్రాథమిక చికిత్స అందించినట్లు ఏడి తెలిపారు.

విచారణ పేరుతో ఒత్తిడికి గురిచేయడం దారుణం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో మైనింగ్ అనుమతులు రద్దుచేయాలని పోరాటం చేస్తున్న టీడీపీ నాయకుడు షేక్ పీరయ్యను విచారణ పేరుతో పోలీసులు మానసిక వత్తికి గురి చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకటరామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విచారణ పేరుతో మూడు రోజులుగా పోలీసులు పీరయ్యను ఇబ్బంది పెట్టడం, ఆయన గుండె నొప్పితో పోలీస్‌స్టేషన్‌లోనే కుప్పకూలడంతో వైద్యశాలకు తరలించడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు మెరుగైన వైద్యసేవలందేలా చర్యలు చేపట్టాలన్నారు. వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు.

జాతీయ రహదారిపై ఇసుకతో వాహదారుల అవస్థలు



జాతీయ రహదారిపై పడిన ఇసుక

ఉదయగిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో 167- బీజీ జాతీయ రహదారిపై టిప్పర్లు, ట్రాక్టర్లు ఇసుక తరలించే సమయంలో ఇసుక రోడ్డుపై పడి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. టోల్‌ప్లాజా నిర్వహణ కాంట్రాక్టర్ ఇసుక తొలగించకపోవడంతో వాహనదారులు ఇసుక ఉన్న ప్రాంతంలో బ్రేక్‌వేస్తే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి జాతీయ రహదారిపై పడ్డ ఇసుకను ఎప్పటికప్పుడు తొలగించి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

బంగారు కుటుంబాల దత్తత అభినందనీయం : ఆర్డీవో



మార్గదర్శులను అభినందిస్తున్న ఆర్డీవో పావని

ఆత్మకూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగంగా పలువురు ముందుకొచ్చి మార్గదర్శులుగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం అభినందనీయమని ఆర్డీవో బి పావని తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో పలు కుటుంబాలను దత్తత తీసుకున్న వారిని ఆమె ఘనంగా సన్మానించి అభినందించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మరికొందరు మార్గదర్శులు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని పీ-4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్, ఎంపీడీవోలు పి రఫీఖాన్, పి ఐజాక్‌ప్రవీణ్, ఆత్మకూరు తహసీల్దారు పద్మజాకుమారి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, పలువురు ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జలజీవన్ పనులు వేగవంతం చేస్తాం : డీఈఈ



జలజీవన్ పనులపై టీడీపీ నేతలతో చర్చిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ

ఆత్మకూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జలజీవన్ పనులను వేగవంతం చేస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ బి మోహన్‌రావు తెలిపారు. సోమవారం ఆయన కరటంపాడు పంచాయతీ పరిధిలో పర్యటించి చేపట్టాల్సి జలజీవన్ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరటంపాడు గ్రామంలో రూ. 88.60 లక్షలు, పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో రూ. 58.60 లక్షలు, సాతానుపల్లిలో రూ.58.30 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంప్‌ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో మొత్తం 169 పనులను పూర్తిచేసేందుకు రూ.49.60 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, పనులు వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూనుగుంట రేవతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, మండల మాజీ ఉపాధ్యక్షుడు గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ బివి సుదర్శన్‌బాబు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం : సీడీపీవో



ఉదయగిరి: తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

సంగం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీవో సునీలత పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సోమవారం ఆమె స్థానిక నిమ్మతోపు అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు తల్లిపాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ రమాదేవి, అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి :** తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించారు. సోమవారం మండలంలోని దేకూరుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలలపాటు పాలు తాపిస్తే సంపూర్ణ పోషక విలువలు అందుతాయని, వ్యాధులు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బత్తల

సంగం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని, ఈనెల 13వ తేదీన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివియన్ మాధవ్ నెల్లూరు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన స్థానిక ఇరిగేషన్ బంగ్లాలో జరిగిన సంగం, చేజర్ల, ఏఎస్ పేట మండలాలకు చెందిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుని పర్యటన కార్యక్రమంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల అధ్యక్షులు, నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

ఉదయగిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు యోగా చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంఈవో-1 తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం పట్టణంలోని నార్త్ ప్రాథమిక పాఠశాలలో ప్రార్థనా సమయంలో విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజు యోగా చేయాలని, యోగా చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు. అనంతరం రిజిస్టర్లు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. అలాగే ఎంఈవో-2 మండలంలోని దుర్గంపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. శుభ్ దిన్ భోజన కార్యక్రమంలో విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు అందజేసిన అబీద్‌అలీని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె వెంకటేశ్వర్లు, హజరత్, ఉపాధ్యాయులు సలీం, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపోలో ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు అర్హులైన వారి వద్ద నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి డిపో మేనేజర్ శివకేశవయాదవ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏడాదిన్నర కాలం హెవీ వెహికల్ లైసెన్సు, 39 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు అర్హులన్నారు. అర్హులైన వారు దరఖాస్తుతోపాటు విద్యార్హత సర్టిఫికెట్, హెవీ లైసెన్సు, ఆధార్‌కార్డు నకళ్లతో డిపో మేనేజర్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అనంతసాగరం ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సాగరం బీసీ కాలనీకి చెందిన పీ ప్రవీణ్ (25) అనే యువకుడు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సేకరించిన వివరాల మేరకు.. ప్రవీణ్ నాగుర్‌కర్నూల్‌లో ప్లేవుడ్ వ్యాపారం చేస్తున్నాడు. ఈతరుణంలో ఆదివారం మోటారుబైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. అతని అంత్యక్రియలు సోమవారం అనంతసాగరంలో జరిగాయి.

కస్టడీ నుంచి నిందితుడి పరారీ

● ఒడిశాలో అరెస్టు చేసిన పోలీసులు



నిందితుడి వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పట్టుబడి సెబ్ స్టేషన్‌లో విచారిస్తుండగా కానిస్టేబుల్‌పై దాడి చేసి, ఓ వ్యక్తి పరారయ్యాడు. అతన్ని నగరంలోని చిన్న బజారు పోలీసులు మూడేళ్ల తర్వాత ఒడిశా రాష్ట్రంలో అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను చిన్న బజారు పోలీసు స్టేషన్‌లో సోమవారం ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు విలేకరులకు వివరించారు. ఒడిశా రాష్ట్రంలోని అటవీ ప్రాంతం నుంచి గంజాయిని నెల్లూరుకు తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్న జే. బిస్వాస్‌ను 2022 జనవరి 8న తెల్లవారుజామున సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శివగిరికాలనీలోని సెబ్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. బిస్వాస్ బాత్రూంకి వెళ్లాలని కోరడంతో సెంట్రీ కానిస్టేబుల్ రవి తీసుకెళ్లాడు. ఆ సమయంలో నిందితుడు కానిస్టేబుల్‌పై దాడి చేసి పరారయ్యాడు. అదేరోజు అప్పటి సెబ్-2 ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి మూడేళ్లుగా నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఈ కేసుపై దృష్టి సారించి ప్రత్యేక బృందాన్ని ఒడిశాకు పంపారు. ఎట్టకేలకు బిస్వాస్‌ను అటవీ ప్రాంతంలో అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేయడంలో కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, ఎస్ఐ అయ్యప్ప, కానిస్టేబుల్స్ ఎస్‌వీ శ్యాంప్రసాద్, ఎం. సుబ్బారావులను ఉన్నతాధికారులు అభినందించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారం, వెండి ఆభరణాలు, నగదుఅపహరణ



బీరువా తాళాలు పగలగొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు

కావలి రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆనెమడుగు పంచాయతీ మొండి దిన్నెపాలెంలోని వి శ్రాంత పోస్టు వ మా స్టర్ ద్రోణాదుల వెంకట సుబ్రహ్మణ్యం ఇంట్లో చోరీ జరిగిన ఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. బాధితుడి బంధువుకు అనారోగ్యంతో ఉండటంతో ఆయనను పరామర్శించేందుకు ఈనెల 1వ తేదీ రాత్రి భార్య సామ్రాజ్యమ్మతో కలసి వెంకట సుబ్రహ్మణ్యం ఇంటికి తాళం వేసుకుని హైదరాబాద్‌కు వెళ్లారు. వెంకట సుబ్రహ్మణ్యం పెద్ద కుమారుడు కెనడాలో ఉండగా రెండవ కుమారుడు వెంకట గిరి కావలి పట్టణంలో ఉంటున్నాడు. ఆయన తన తల్లిదండ్రులు ఇంట్లో లేకపోవడంతో 2వ తేదీన మొండిదిన్నెపాలెంలోని ఇంటికి వెళ్లి చెట్లకు నీరు పట్టి ఆ రాత్రి కావలి వెళ్లాడు. మరుసటి రోజు ఆదివారం సాయంత్రం చెట్లకు నీరు పట్టేందుకు ఆయన మళ్లీ ఇంటికి వెళ్లగా ఇంటి గ్రిల్స్ తాళాలు, తలుపుల తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు ఇంట్లో ఉన్న బీరువా తాళాలు పగలగొట్టి వస్తువులు చిందరవందర చేసి ఉండడాన్ని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చాడు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన వెంకట సుబ్రహ్మణ్యం ఇంట్లో పరిశీలించగా రెండు బీరువా ల్లోని సుమారు 20 సవర్ల బంగారు ఆభరణాలు, 1.5 కేజీల వెండి వస్తువులు, రూ.11వేలతోపాటు, 3 లాఫింగ్ బుద్ధ హుండీ విగ్రహాల్లో ఉంచిన రూ.30,000 (రూ.5 కాయిన్స్) అపహరించు కెళ్లినట్లు గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ ఎస్ఐలు బాజీబాబు, కృష్ణయ్యలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలు స్వీకరించారు. 2వ తేది రాత్రి, లేదా 3వ తేదీన తెల్లవారు జామున దుండగులు చోరీకి పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్తను హతమార్చిన భార్య

● రక్తపు మరకలు తుడిచి ప్రమాదంగా చిత్రీకరణ

● మృతదేహాన్ని తడిమి చూడగా గాయాలు



శ్రీనివాసకుమార్ మృతదేహం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి): మద్యం మత్తులో భర్త దూషించడంతో కత్తితో పొడిచి చంపిన భార్య ఉదంతమిది. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు శెట్టిగుంట రోడ్డుకి చెందిన గోలి శ్రీనివాసకుమార్ (38)కు, ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన లక్ష్మీ ప్రసన్నతో 13 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారి కి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. శ్రీనివాసకుమార్ కొయ్యలకు పాలిష్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిం చేవాడు. ప్రస్తుతం వారు నవాబుపేట పరిధి న్యూకాలనీలో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి శ్రీనివాస కుమార్ మద్యం మత్తులో మిద్దెపైకి ఎక్కేటప్పుడు మెట్లపై నుంచి జారి కిందపడి చనిపోయాడని లక్ష్మీప్రసన్న మనుబోలులో ఉంటున్న తన వదిన (మృతుడి అక్క) రమణమ్మకు ఫోన్‌చేసి చెప్పింది. వెంటనే ఆమె తమ కుటుంబసభ్యులతో కలిసి నెల్లూరుకి చేరుకుంది. మెట్ల పక్కనే పడిఉన్న తమ్ముడి మృతదేహాన్ని పట్టుకొని భోరున ఏడుస్తుండగా, ఎడమ పిరుదుపై రెండు చోట్ల కత్తి గాయాలు ఉండటాన్ని గమనించింది. దీంతో ఆమె లక్ష్మీప్రసన్నను అడిగేందుకు చూడగా ఆమె కనిపించలేదు. దీంతో అన్న కుమార్తె వెంకటసాయి భవానీని అడగ్గా అసలు విషయం బయటకు వచ్చింది.

● **రక్తపు మరకలు తుడిచేసి...**

కొంతకాలంగా శ్రీనివాసకుమార్ మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై భార్యభర్తల మధ్య తరచూ గొడవలు, ఘర్షణలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో ఆదివారం దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో శ్రీనివాసకుమార్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటాక మళ్లీ ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో మరోసారి గొడవ పడ్డారు. భర్త దూషించాడని ఆవేశానికి గురైన లక్ష్మీ ప్రసన్న కత్తితో గట్టిగా పొడవడంతో అక్కడికక్కడే శ్రీనివాసకుమార్ మృతి చెందాడు. భర్త మృతిని ప్రమాదంగా చిత్రీకరించాలని భావించిన ఆమె తనకు పరిచయమున్న ప్రవీణ్ అనే వ్యక్తికి ఫోన్ చేసింది. ఆయన ఇంటికి రాగానే మృతదేహాన్ని మెట్లకింద ఉంచి, రక్తపు మరకలన్నింటినీ శుభ్రంచేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చే సింది. ఈ విషయమై మృతుడి అక్క రమణమ్మ నవాబుపేట పోలీ సులకు సోమవారం ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	107
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	222

కోడిగుడ్ల ధర (100): 475

కలిగిరిలో మోస్తరు వర్షం

కలిగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ప్రస్తుత సీజన్‌లోనూ మండుతున్న ఎండల నేపథ్యంలో ఈ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో మండల వాసులు ఉపశమనం పొందారు. పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవడంతో రాకపోకలు సాగించలేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నాణ్యతకు తిలోదకాలు!

● ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో పర్యవేక్షణ లోపం ● హడావిడిగా పనులు - నామమాత్రంగా క్యూరింగ్ ● మన్నికపై ఎన్నో అనుమానాలు

కందుకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధాన రహదారి విస్తరణ, సెంట్రల్ డివైడర్ పనులు అధికారుల పర్యవేక్షణ లోపంతో నాణ్యత ప్రమాణాలకు తూట్లు పొడుస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ నిర్మిస్తున్న సిమెంటు రోడ్డుకు వాటర్ క్యూరింగ్ అంతంతమాత్రంగా ఉండడంతో ఈ రోడ్డు నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతోన్నాయి. పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ నుంచి పామూరు రోడ్డు సర్కిల్ వరకు రహదారి విస్తరణ, సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకోసం రూ.1.25 కోట్లు మంజూరై పనులు ప్రారంభమయ్యాయి. పామూరు రోడ్డులో ఇరువైపులా సిమెంటు రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం బెడ్‌కాంక్రీట్ వేసి కనీసం రెండువారాలు క్యూరింగ్ జరిగాక ఫైనల్ లేయరు వేయాల్సి ఉండగా బెడ్‌కాంక్రీట్ వేశాక రెండు మూడు రోజులు కూడా జరగకుండానే ఫైనల్ లేయరు వేసేస్తున్నారు. అలాగే ఫైనల్ లేయరు కనీసం మూడు వారాలు క్యూరింగ్ జరగాల్సి ఉండగా వారం రోజులు తిరగకుండానే క్యూరింగ్ ఆపేస్తుండటంతో ఈ రోడ్డు మన్నికపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే నాణ్యత లోపిస్తుందన్న విమర్శలు ఉన్నాయి. సిమెంటు శాతం కూడా నిర్దిష్ట ప్రమాణం కన్నా తక్కువగా వాడుతున్నారన్న సందేహాలు వ్యక్తమవుతోన్నాయి. పనులు హడావిడిగా పూర్తి చేయించాలన్న ఆలోచనలో నాణ్యతా ప్రమాణాలను వదిలేస్తుండటం ఎంత వరకు సబబు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిత్యం ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రధాన రహదారి కావడం వల్ల నాణ్యతలో ఏమాత్రం లోపం జరిగినా, తగినన్నిరోజులు క్యూరింగ్ చేయకపోయినా సిమెంటు రహదారి అనతికాలంలోనే దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ డీఈఈ గణపతిని వివరణ కోరగా బెడ్‌కాంక్రీట్ వేశాక నాలుగైదు రోజులు గ్యాప్ ఇచ్చాకే ఫైనల్ లేయరు వేయిస్తున్నామని, ట్రా ఫిక్ సమస్య కోసం ఫైనల్ లేయరుకి మూ డు వారాలు క్యూరింగ్ చేయకుండా ట్రాఫిక్ వదిలామని చెప్పారు. ఉద యం, సాయంత్రం నీరు పట్టిం చే ఏర్పాటు చేస్తామని సమాధాన మిచ్చారు.



పామూరు రోడ్డు విస్తరణలో భాగంగా జరుగుతున్న నిర్మాణ పనులు



సరైన వాటర్ క్యూరింగ్ చేయని సిమెంట్ రోడ్డు

పక్కా గృహాల పెండింగ్ బిల్లులు అందేనా?

● ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

వలేటివారిపాలెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఎప్పుడు అందుతాయా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. మండలంలో 2016 నుంచి 2019 వరకు నిర్మించుకున్న పక్కా గృహాలకు పెండింగ్ బల్లులు నేటికీ అందలేదు. అధికారిక లెక్కల ప్రకారం ఆ ఐదేళ్లలో 382 పక్కా గృహాల నిర్మాణాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 వరకు ఐదేళ్లలో విడతల వారీగా అన్ని వర్గాలకు 685 పక్కా గృహాలు మంజూరయ్యాయి. లబ్ధిదారులు ప్రభుత్వ సాయం కంటే వారి ఆర్థిక స్థోమతను బట్టి గృహాలను నిర్మించుకున్నారు. టీడీపీ అధికారంలో ఉన్న ఆ ఐదేళ్లలో 303 ఇళ్లు పూర్తయి, 382 ఇళ్లు వివిధ దశల్లో ఉండిపోయాయి. అనంతరం 2019లోఅధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన పక్కా గృహాలకు బిల్లులు చెల్లించకుండా నిలిపివేసింది. అలస్యంగా అయిన అప్పటి వైసీపీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందన్న ఆలోచనతో లబ్ధిదారులు ఐదేళ్లు ఎదురుచూశారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఒక్క పెండింగ్ బిల్లు కూడా ఇవ్వలేదు. దీంతో పక్కా గృహాల నిర్మాణం కోసం బడుగు బలహీన వర్గాల ప్రజలు అప్పులు చేసుకొని, మహిళల మెడలో ఉన్న కాస్తోకూస్తో బంగారం తాకట్టు పెట్టుకొని మరీ ఇంటి నిర్మాణాలను కొనసాగించారు. వైసీపీ ప్రభుత్వం కక్ష పూరితంగా బిల్లులు నిలిపివేయడంతో వారంతా లబోదిబోమన్నారు. పెండింగ్ బిల్లుల కోసం లబ్ధిదారులు అధికారులు చుట్టూ తిరిగి తిరిగి వేశారిపోయారు. ఇక ఏ ప్రభుత్వం వచ్చినా ఆ బిల్లులు గతి అంతేనా అని మిన్నకుండిపోయారు. కాగా ఏడాది క్రితం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. ఆరు నెలలు గడిచిన తరువాత 2014 నుంచి 2019 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు పెండింగ్ బల్లులు మంజూరు చేస్తామని ప్రకటించండం పట్ల లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. పెండింగ్ బిల్లులు మంజూరయితే గృహ నిర్మాణం కోసం చేసిన అప్పులైనా తీర్చుకోవచ్చు అనుకొని ఆశపడ్డారు. కూటమి ప్రభుత్వం చెప్పిన ఆశ ఎప్పుడు తీరుతుందా అని ఎదురుచూస్తున్నారు. ఆ ప్రకటన వెలువడి ఆరు నెలలు గడిచిపోయినా పెండింగ్ బిల్లులు విషయం ఏమి తెలియకపోవడంతో బిల్లులు వస్తాయా రావా అనే ఆందోళనలో పడిపోయారు. మరి ఎంత కాలానికి వస్తాయో రావా అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఈ విషయంపై వలేటివారిపాలెం హౌసింగ్ ఏఈ నాగరాజును వివరణ కోరగా గత టీడీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన గృహాల పెండింగ్ బిల్లులు వివరాల నివేదికలను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

నమ్మిన వారికి అండగా ఉంటాం



దుండిగం కాలనీలో మహిళలతో మాట్లాడుతున్న భానుచందర్ నాయుడు

దగదర్తి(బిట్రగుంట) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నమ్ముకున్న వారికి మాలేపాటి కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు అన్నారు. దగదర్తి మండలం దుండిగం ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ కాలనీల్లో 78 కుటుంబాలకు సుమారు రూ.4.75 లక్షల సొంత నిధులతో అందజేసిన సిమెంట్, రేకులతో చేపట్టి నిర్మాణ పనుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మాలేపాటి రామానాయుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేపర్ల సూరిబాబు, వర్థినేని కృష్ణ, ఏడుకొండలు, టీ.వెంకటేశ్వర్లు, ఎం.పవన్, కే.శీనయ్య, రమణమ్మ, అంకబాబు, తదితరులు పాల్గొన్నారు.

అజిత్ ఆచూకీ తెలపండి!

● ఉలవపాడు స్టేషన్ వద్ద కరేడు రైతుల ఆందోళన

ఉలవపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : నల్లపరెడ్డి అజిత్‌రెడ్డిని అరెస్టు చేసి ఎక్కడకు తీసుకెళ్లారో ఆచూకీ తెలపాలంటూ కరేడుకు చెందిన రైతులు, గ్రామస్థులు ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. భూసేకరణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరిస్తున్నందనే అజిత్‌రెడ్డిని అరెస్టు చేశారంటూ డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వద్ద వాపోయారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన డీఎస్పీ ఎర్రచందనం అక్రమ తరలింపులో కరేడుకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు సోషల్ మీడియాలో వస్తోందని అన్నారు. కలిగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని కందుకూరు సబ్ డివిజన్ పరిధిలోని కేసుకు సంబంధం లేదని రైతులకు నచ్చచెప్పి పంపించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం!



ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ తీగలకు అల్లుకున్న పిచ్చిచెట్ల తీగలు

కావలి రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనగర్ కాలనీ దారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలకు చెట్ల తీగలు పెనవేసుకుని ప్రమాదకరంగా అల్లుకున్నాయి. దీంతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు వస్తున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని వెంగళరావునగర్ కొత్త శివాలయం నుంచి ముసునూరు ఇందిరమ్మ కాలనీకి వెళ్లే మార్గంలో నూతనంగా ఎత్తుగా సీసీ రోడ్డు ఏర్పాటు చేయడంతో రోడ్డు అంచునే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తగ్గిపోయి ప్రమాదకరంగా ఉంది. దానికి తోడు చెట్ల తీగలు అల్లుకుపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలు ఆశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చెయ్యాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కొండాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. మండలంలోని ఇస్కదామెర్ల పంచాయతీ పొట్టిపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ పాలన పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు. ఎస్టీ కాలనీలో ఇప్పటి వరకు ఆధార్ కార్డు, రేషన్ కార్డులు లేవని దీంతో తల్లికి వందనం నగదు రాలేదని బాధితులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబునాయుడు, యారవ కృష్ణయ్య, పోలినేని రమేష్, దాసరి అశోక్, ఏలూరి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి వెంకటేశ్వర్లు, వెంకటరమణ, కె.శ్రీనివాసులు, గద్దె మాధవ, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తదితరులు

పీ-4లో భాగస్వాములు కావాలి

● స్వచ్ఛంద సంస్థలకు ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ సూచన



స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులతో చర్చిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కావలి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుపేదలు ఎవరూ ఉండకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన పీ-4 కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో ఆయన చర్చించారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఎవరైనా పీ-4 కింద నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకోగలిగితే ముందుకు రావాలన్నారు. తగిన ఆర్థిక స్థోమత లేకపోతే వారికి మార్గదర్శకులుగా పనిచేయాలని కోరారు. ఇప్పటికే నియోజకవర్గంలో పీ-4 కింద ఉన్న కుటుంబాలను గుర్తించి వారికి ఉపయోగపడగలిగే దాతలను కూడా కొంత మందిని గుర్తించామన్నారు. ఈ కార్యక్రమం విభాగంకు చెందిన వారి వద్ద ఆ వివరాలు ఉన్నాయని, వాటిని అందచేస్తామని చెప్పారు. వారే కాకుండా ఇంకా నిరుపేద కుటుంబాల వివరాలను, దాతలు వివరాలను తెలియచేయాలన్నారు. నిరుపేద కుటుంబాలను దాతలు దత్త తీసుకున్న తర్వాత స్వచ్ఛంద సేవకులుగా మీరు వారి బాగోగులను చూసుకుంటూ మార్గదర్శకులుగా ఉండాలన్నారు. ఆర్థికస్తోమతతో సంబంధం లేని పలు సేవలను పీ-4 కుటుంబాలకు అందచేయాలని చెప్పారు. దానికి స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సుముఖత వ్యక్తం చేశారు.

షాపింగ్ కాంప్లెక్స్‌పై స్టేటస్‌కో పొడిగింపు

కందుకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : కందుకూరు గ్రామ దేవత అంకమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌పై హైకోర్టు స్టేటస్‌కోను మరో వారం రోజులు పొడిగించింది. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీఓటీ) పద్ధతిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి దేవాదాయశాఖ బహిరంగ వేలం విధానంలో రూములు కేటాయించగా ఆలయ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వలన భక్తులకు అసౌకర్యం కలుగుతుందని ఆలయ పూర్వ ధర్మకర్త దివి లింగయ్యానాయుడు హైకోర్టులో పిల్ వేశారు. దీంతో కోర్టు మూడు వారాల క్రితం స్టేటస్‌కో ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆలయ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం తగదని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న ప్రదేశంలో కొంతభాగం ప్రభుత్వ స్థలంగా ఉందని లింగయ్యానాయుడు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరగగా దేవాదాయశాఖ తరుపు న్యాయవాది ప్రభుత్వ స్థలాన్ని ఆలయానికి దాఖలు పరుస్తు పొజిషన్ సర్టిఫికెట్ ఉందని వాదించగా గతంలో లేని సర్టిఫికెటు ఇప్పుడు ఎలా వచ్చిందని లింగయ్యనాయుడు తరుపు న్యాయవాది వాదించినట్లు సమాచారం. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి కేసును ఈనెల 11వ తేదీకి వాయిదా వేస్తూ అప్పటి వరకు రూములు నిర్మాణంపై స్టేటస్‌కో యధావిధంగా కొనసాగుతుందని ఉత్తర్వులు ఇచ్చింది.

మందబయలు భూములు అటవీశాఖకు కేటాయించొద్దు

● కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజకు వినతి

కొండాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుఎర్రబల్లి గ్రామ మైనర్ ఇరిగేషన్ చెరువును ఆనుకొని దక్షిణం వైపున సర్వే నెంబరు 672లో ఉన్న 580.5 ఎకరాల భూమిని అటవీశాఖకు కేటాయించవద్దంటూ గ్రామస్థులు దగడ మాలకొండారెడ్డి, అనిల్ తదితరులు సోమవారం కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరు మందబయలు భూమిలో గ్రామంలోని పశువులు, గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు మేత మేస్తుండేవన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు ఆ భూమిని అటవీశాఖకు కేటాయించారంటూ అధికారులు రాళ్లు నాటారన్నారు. అటవీశాఖ అధికారులు భూమిని చదును చేసి మొక్కలు నాటితే గ్రామంలో ఉన్న దాదాపు 5000 పశువులు, గొర్రెలు, మేకలు మేత మేసేందుకు ఎటువంటి అవకాశం లేదన్నారు. పశువులపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని, అటువంటి పరిస్థితి రాకుండా చూడాలని గ్రామస్థులు ఆమెను కోరారు. ఈ విషయాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారని గ్రామస్థులు తెలిపారు.



కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం అందచేస్తున్న తూర్పుఎర్రబల్లి గ్రామస్థులు

బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టండి

● రాజ్యసభలో బీద మస్తాన్‌రావు యాదవ్

కావలి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు యాదవ్ కోరారు. సోమవారం ఆయన రాజ్యసభలో మాట్లాడారు. కాకినాడ నుంచి తమిళనాడులోని చిదంబరం వరకు 420 కి.మీ పొడవున విస్తరించి ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణ జరిగితే 2047 నాటికి 7.14 మిలియన్ టన్నుల సరుకులు రవాణా చేయవచ్చన్నారు. అలాగే రామాయపట్నం పోర్టుకు రైలు కనెక్టివిటీపై, బిట్రగుంట, కావలి రైల్వేస్టేషన్ల అభివృద్ధిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానం ఇస్తూ రామాయపట్నం పోర్టు నుంచి తెట్టు రైల్వేస్టేషన్ వరకు కనెక్టివిటీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైం బోర్డు ద్వారా గతిశక్తి మల్టీమోడల్ కార్గో టెర్మినల్ పాలసీ కింద పనులు చేపట్టమన్నారు. బిట్రగుంట, కావలి రైల్వేస్టేషన్లలో నూతన భవనాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, షెల్టర్లు, వెయింటింగ్ హాల్‌లు పూర్తి అయ్యాయని చెప్పారు. బిట్రగుంటలో దివ్యాంగుల కోసం ప్రత్యేక మార్గాలు, రోడ్డు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. కావలిలో దివ్యాంగుల మార్గాలు, లిఫ్టులు నిర్మాణంలో ఉన్నాయని మంత్రి తెలిపారన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

బిట్రగుంట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దళితులు, వారి కుటుంబాలపై దాడి చేసిన వారి వెంటనే శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు డిమాండ్ చేశారు. బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంటలో శనివారం ఎస్సీపాలెంకు చెందిన కొందరు చేసిన దాడులను ఆయన ఖండించారు. సోమవారం ఆయన మాట్లాడుతు కులదూషణ చేయడమే కాకుండా మారణాయుధాలతో ఇళ్లపై దాడులు చేయడం ఎంత వరకు సమజ్యసమని ప్రశ్నించారు. అడ్డువచ్చిన దళిత మహిళలను అసభ్యంగా మాట్లాడుతూ వారిపై చేయిచేసుకోవడం కుల అహంకారమే అన్నారు. ముకుమ్మడి దాడికి దిగిన వారిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

దళిత కుటుంబాలకు పరామర్శ



దళితులతో మాట్లాడుతున్న దళితనేత జువ్విగుంట బాబు

బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట దళితులను సోమవారం మాల ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్విగుంట బాబు పరామర్శించారు. దళితవాడపై జరిగిన మూడుమ్మడిని తీవ్రంగా ఖండించారు. దళిత కుటుంబాలపై జరిగిన దాడులకు న్యాయం చేయమని కావలి రూరల్ సీఐని కోరుతామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యోగ సంఘాల నేతలు నెలగాని హరి, ఆదినారాయణ, జైభీం అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర, బహుజన సమాజ్‌వాది నేతలు కేశనంద, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, సంకల్ప బలంతోనే ఉన్నత శిఖరాలు

కావలి(టౌన్), ఆగస్టు4(ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, సంకల్ప బలంతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకుంటారని విశ్రాంత వింగ్ కమాండర్ ఐ ప్రేమ చంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు, తండ్రిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజంలో సాంకేతిక విద్యకు రోజురోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. అన్ని రంగాలకు చెందిన సేవలు సాంకేతిక విద్యతో ముడిపడి ఉన్నాయన్నారు. విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకుని మొదటి సంవత్సరం నుంచే లక్ష్యాలు ఏర్పరచుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ప్లేస్‌మెంట్ డైరెక్టర్ వంశీ మోహన్ మాట్లాడుతూ అంతర్జాతీయ సంస్థలలో ఉద్యోగావకాశాలకు కావాల్సిన సాఫ్ట్ స్కిల్స్ ఆప్టిట్యూడ్, కోడింగ్ తదితర అంశాలలో నిష్ణాతులైన ఆచార్యలచే శిక్షణ అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తరచూ కళాశాలను సందర్శించి తమ పిల్లలు పురోగతి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.



రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరుపయోగంగా మరుగుదొడ్డి

ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుకు పరుగు!

● నిరుపయోగంగా మరుగుదొడ్డి ● ఇబ్బందులు పడుతున్న మహిళలు ● పట్టించుకోని అధికారులు

కావలి రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలు ఎన్ని ఉన్నా శాఖల మధ్యన సమన్వయ లోపంతో కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అత్యవసర సమయాల్లో మరుగుదొడ్ల కోసం పరుగులు తీయాల్సి వస్తోంది. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం, రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్‌జైల్, రూరల్ పోలీస్ స్టేషన్, ట్రెజరీ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాయం ఇలా ప్రభుత్వ కార్యాయాలు అన్నీ ఒకే ప్రాంగణంలో ఉండటంతో నిత్యం గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వందలాదిగా ప్రజలు వస్తుంటారు. కానీ కార్యాలయాల్లో పనిచేసే అధికారులకు, సిబ్బందికి తప్ప బయటి వ్యక్తులకు మరుగుదొడ్లు లేవన్న ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వంలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ఆ మరుగు దొడ్ల నిర్వహణ లేకపోవడంతో కొన్ని రోజులకే నిరుపయోగంగా మారిపోయాయి. అప్పటి నుంచి కార్యాయాలకు వచ్చే మహిళలు కూడా మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లు ఉపయోగంలోకి తేవాలని, మరుగుదొడ్ల నిర్వహణ మున్సిపాలిటీ చేపట్టాలని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుతున్న మరుగుదొడ్డి సీట్లు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

మంగళవారం 5 ఆగస్టు 2025

చెవిరెడ్డీ.. నీ నటనను నమ్మరెవరు?



కోర్టు బయట అధికారులను బెదిరి స్తావ్. జడ్జిల ముందు ఏడుస్తావ్. మద్యం కుంభకోణంలో సంబంధం లేదంటూ రోజుకో అబద్ధాన్ని చెప్తావ్. ఇలా నీ నటనతో ప్రజలను నమ్మించాలని ప్రయత్నించావ్. కానీ, బయటపడుతున్న సాక్ష్యాధారాలతో నీ నటనను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. లిక్కర్ స్కామ్‌లో జగన్‌కంటే నీ పాత్రే కీలకం. మద్యం సొమ్మును విదేశాలకు తరలించడంలోనూ చెవిరెడ్డి ముఠా కీలకపాత్ర పోషించింది. తుడాలోనూ పాల్పడ్డ అవినీతికి తండ్రీ కొడుకులు (చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి) శిక్ష అనుభవిస్తారు. అక్రమ సంపాదనతో తుమ్మలగుంటలో నిర్మించిన దేవాలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసకోవాలి.

- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ,
తిరుపతి రూరల్ టీడీపీ కార్యాలయంలో

దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది భూమనా..



"భూమన కరుణాకరరెడ్డి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉంటుంది. దేశసరిహద్దుల్లో ఉగ్రదాడుల నేపథ్యంలో తిరుమల భద్రతకు టీటీడీ ప్రాధాన్యం ఇచ్చింది. మఠాలకు వచ్చే భక్తుల ఆధార్ కార్డు, వివరాలు నమోదు చేయాలనీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలనీ సూచిస్తే.. దీనిని హిందూమతంపై, మఠాలపై దాడి అంటారా? అబద్ధాలు ప్రచారం చేయడమే మీరు పనిగా పెట్టుకున్నారు భూమనా! తిరుమలను ధనార్జన క్షేత్రంగా, రాజకీయ పునరావసకేంద్రంగా మార్చిన మీరు.. పరకామణి దొంగను సెఫ్ ఎగ్జిట్ చేసిన మీరా ఈరోజు నీతులు చెప్పేది?"

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి
తిరుమలలో



బస్సులో ఇరుక్కుపోయిన ఖాదర్ మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు, హైవే సిబ్బంది

లారీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

- క్లీనర్ మృతి, మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- 10 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు



- గాయపడిన డ్రైవర్ సురేష్‌రెడ్డి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులంతా గాఢనిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా పెద్ద శబ్ధం. లేచి చూసేసరికి క్లీనర్ మృతి చెంది ఉండగా, మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రక్తం కారుతున్న కొందరు ప్రయాణికులు ఒకరినొకరు చూసుకొని కేకలు వేశారు. ఈ ఘటన నాయుడుపేట జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం అర్ధరాత్రి ఒంగోలు నుంచి బెంగళూరుకు ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు బయలుదేరింది. సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు నాయుడుపేట - చెన్నై జాతీయ రహదారి సమీపంలోకి రాగానే బొగ్గు లోడుతో ముందు వెళ్తున్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ ఖాదర్(45) క్యాబిన్‌లో ఇరుక్కొని అక్కడిక్కడే మృతి చెందాడు. మరో డ్రైవర్ సురేష్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. బస్సు నడుపుతున్న గౌస్‌బాషా, 10 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, హైవే మొబైల్, 108సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని బస్సులో ఇరుక్కుపోయిన ఖాదర్ మృతదేహాన్ని అతి కష్టంమీద బయటకు తీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదానికి గురైన రెండు వాహనాలు రోడ్డుపైనే ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు క్రేన్ సహాయంతో రెండు వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్మార్ట్ మీటర్లతో ఉపయోగమే

వినియోగదారులపై భారం పడదు ● సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు



తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థలో ఆధునిక సాంకేతిక వ్యవస్థ అందుబాటులోని వస్తున్న సమయంలో వినియోగదారులకు, సంస్థకు ఉపయోగకరంగా ఉండేందుకు, అన్ని కేటగిరిల్లో (వ్యవసాయరంగం తప్ప) స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నట్లు సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు సోమవారం వెల్లడించారు. గతంలో విద్యుత్ సంస్థలో చక్రం తిరుగుతూ రీడింగ్ చూపించే మెకానిక్ మీటరు ఉండేదన్నారు. సాంకేతికత పెరిగేకొద్దీ వాటి స్థానంలో డిజిటల్ మీటర్లు వచ్చాయన్నారు. డిజిటల్ మీటరు, స్మార్ట్ మీటరుతో సమానమేనని ఆయన చెప్పారు. ఈ స్మార్ట్ మీటరుతో విద్యుత్ వినియోగాన్ని ప్రతి రోజు, ప్రతి గంటా పరిశీలించుకోవచ్చన్నారు. వినియోగం ఎక్కువ అవుతుందని తెలిస్తే, పొదుపుగా వాడుకొనే అవకాశం ఉందన్నారు. వినియోగదారులపై పెరిగే భారాన్ని, వారే నియంత్రించుకోవచ్చన్నారు. వినియోగదారులు ఎక్కడున్నా ఆన్‌లైన్‌లో మీటర్ రీడింగ్ పరిశీలించుకోవచ్చని సూచించారు. ఇది కచ్చితమైన మీటర్ రీడింగ్ చూపిస్తుందని చెప్పారు. విద్యుత్ లోడ్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవచ్చన్నారు. మీటర్ రీడింగ్ నిర్ణయించిన తేదీలో తీసే అవకాశం ఉందన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి రీడింగ్ తీసే అవసరం వుండదన్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చే విషయంలో వినియోగదారులు అపోహలు వీడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ పంపిణీ పునర్ వ్యవస్థీకరణ పథకం(ఆర్డీఎస్ఎస్)లో భాగంగా ఈ మీటర్లు అమర్చుతున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఏపీఈఆర్సీ) 2021 ఫిబ్రవరిలో ఈ మీటర్లు అమర్చడానికి అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు సదరన్ డిస్కం సంస్థ పరిధిలోని 1,52,016 ప్రభుత్వ రంగ సంస్థలకు, 53,64,841 వాణిజ్య సర్వీసులకు, 43009 పరిశ్రమలకు మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గృహ విద్యుత్ సర్వీసుల్లో 200 యూనిట్ల కంటే ఎక్కువగా విద్యుత్ వినియోగిస్తున్న సర్వీసులను గుర్తించి దశల వారీగా ఈ మీటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మీటరు విలువ రూ.ఆరు వేలు ఉండొచ్చని, వినియోగదారులకు ఉచితంగా అమర్చుతామని చెప్పారు. ఈ స్మార్టు మీటర్లు అమర్చాక వినియోగ బిల్లుల్లో మీటరు కోసం అదనపు చార్జీలు విధించేది లేదని ఆయన స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లపై వినియోగదారులకు అవగాహనా కార్యక్రమాలు చేపడతామన్నారు. వీటిపై వినియోగదారులకు అనుమానాలుంటే టోల్ ఫ్రీ నెంబరు 1912 కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు.

పోలీసు జాగిలం మృతి



పోలీసు జాగిలం పృథ్వీ

తిరుపతి (నేరవిభాగం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నో బంగారు పతకాలు సాధించింది. వీఐపీల భద్రతలో సమర్థంగా వ్యవహరించింది. పోలీసు శాఖకు విశిష్ట సేవలు అందించింది. అలాంటి పోలీసు జాగిలం పృథ్వీ.. వయోభారంతో సోమవారం మృతిచెందింది. ఎనిమిది సంవత్సరాల పాటు పోలీసు శాఖకు సేవలు అందించి 2023లో పదవీ విరమణ పొందింది. రిజర్వు అదనపు ఎస్పీ శ్రీనివాసరావు జిల్లా డాగ్ కెనాల్ వద్ద పృథ్వీ కళేబరంపై పుష్పగుచ్ఛం ఉంచి గౌరవ వందనం సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖకు జాగిలం అందించిన సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజర్వు డీఎస్పీలు, సీఐలు, సీవీఎస్‌వో మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. లాబ్రడార్ రిట్రైవర్ జాతికి చెందిన పృథ్వీ హ్యాండ్లర్ మోహన్ నేతృత్వంలో పలువురు వీవీఐపీల బందోబస్తు సందర్భంగాను.. తిరుమల బ్రహ్మోత్సవాల సమయాల్లోనూ భద్రతా తనిఖీల్లో పాల్గొంది. బేసిక్ శిక్షణలో 2014లో గోల్డు మెడల్ సాధించింది. లక్నోలో జరిగిన ఆల్ ఇండియా ఇండియా డ్యూటీ మీట్‌లో 2019లో పాల్గొనింది. 2020లో జరిగిన ఏపీ పోలీసు డ్యూటీ మీట్‌లో గోల్డు మెడల్ సాధించింది.



జాగిలానికి నివాళులు అర్పిస్తున్న అదనపు ఎస్పీ

ప్లాట్ కొంటే పాట్లే!

శ్రీకాళహస్తిలో యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు ● మోసపోతున్న జనం

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్ని నిబంధనలు విధించినప్పటికీ అధికారుల అలసత్వంతో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తూనే ఉన్నాయి. అక్కడ ప్లాట్లు కొనే ప్రజలకు పాట్లు తప్పడం లేదు. ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి పట్టణం శరవేగంగా విస్తరిస్తోంది. పరిసరాల్లో భారీ పరిశ్రమలు, కేంద్ర విద్యాసంస్థలు, జాతీయ రహదారి, సమీపంలో సెజ్‌లు ఉండటంతో ఇక్కడ నివాస స్థలాలకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఇదే అదనుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇక్కడ గద్దల్లా వాలిపోయారు. రాత్రికి రాత్రే వ్యవసాయ భూములను చదును చేసి, అనధికారికంగా లేఅవుట్లు గీసి ప్రజలకు విక్రయించి కోట్లు గడిస్తున్నారు.



తొట్టంబేడులో వేసిన లే అవుట్

భెల్ పరిశ్రమ ఏర్పాటుతో..

గతంలో మన్నవరం భెల్ పరిశ్రమ ఏర్పాటుపై అధికారిక ప్రకటన వెలువడటంతో నియోజకవర్గంలో పంట పొలాల్లో లేఅవుట్లు వేసి ఇష్టారాజ్యంగా అమ్మి సొమ్ము చేసుకున్నారు. అలాంటి ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు 15ఏళ్ల నుంచి ఎలాంటి అభివృద్ధీ లేక అత్యవసర పరిస్థితుల్లో తిరిగి విక్రయించుకోలేక ఇబ్బంది పడుతున్నారు.

వైసీపీ పాలనలో మూడు పువ్వులు..ఆరు కాయలుగా..

గత వైసీపీ పాలనలో రియల్ వ్యాపారుల అక్రమ లేఅవుట్ల దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిబంధనల ప్రకారం లేఅవుట్లు ఏర్పాటు చేయాల్సి వస్తుందన్న అనుమానంతో కొన్ని నెలల పాటు ఎక్కడా లావాదేవీలు జరపలేదు. ప్రస్తుతం మళ్లీ తమ కార్యకలాపాలకు పదును పెట్టారు. ఏదైనా వ్యవసాయ భూమిని ఐదుశాతం మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వానికి చలానా చెల్లించి ఆర్డీవో ద్వారా ల్యాండ్ కన్వర్షన్ ప్రొసీడింగ్స్ పొందాలి. ఆ తర్వాత అప్రూవల్ చేసుకోవాలి. అయితే కనీసం కన్వర్షన్‌గా కూడా చేయకుండా వందలాది లేఅవుట్లు శ్రీకాళహస్తి చుట్టుపక్కల వేశారు. అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు ఇల్లు కట్టుకునే సమయంలో ఇరుకు రోడ్లు, కన్వర్షన్ అప్రూవల్ రాక ముప్పుతిప్పలు పడుతున్నారు. కన్వర్షన్ కూడా లేకపోవడంతో కొంతకాలానికి ప్రైవేటు వ్యక్తులు వచ్చి ఈ భూమి తమదంటూ గొడవకు దిగుతున్న ఘటనలు చాలా ఉన్నాయి.

ప్రభుత్వం మారినా అదేతీరు

కూటమి ప్రభుత్వంలోనూ అక్రమ లేఅవుట్లు కోరలు చాస్తున్నాయి. ఇటీవల శ్రీకాళహస్తి - తిరుపతి ప్రధాన రహదారికి ఆనుకుని పట్టణంలోని మిట్టకండ్రిగ వద్ద రెండు లేఅవుట్లు వెలిశాయి. ఇటువైపున నిత్యం అధికారులు రాకపోకలు సాగిస్తూనే ఉంటారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

70 అక్రమ లేఅవుట్లు...

తొట్టంబేడు గ్రామం శ్రీకాళహస్తి పట్టణంలో భాగంగా అభివృద్ధి చెందింది. తొట్టంబేడు రెవెన్యూ పరిధిలో ఇప్పటికే 70కి పైగా కన్వర్షన్ కానీ అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. తాజాగా తొట్టంబేడు గ్రామానికి అనుకుని తూర్పు వైపున రెండు రోజుల నుంచి రాత్రివేళలో రెండు ఎకరాల్లో భూమిని చదును చేసి గ్రావెల్ తోలి అక్రమ లే అవుట్ ఏర్పాటు చేశారు. తొట్టంబేడు దళితవాడలోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిమెంటు రోడ్డును వెంచర్‌కు ప్రధాన మార్గంగా చూపుతూ లేఅవుట్‌ను రూపొందించారు. శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారులు ఇకనైనా అక్రమ లేఅవుట్లపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాంగ్ రూట్‌లో వచ్చిన బైక్

- పనపాకం వద్ద లారీ ఢీకొనడంతో ఇద్దరు యువకుల దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హరీష్‌నాయుడు, పరంధామ

చంద్రగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం పనపాకం వద్ద పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో సోమవారం రాత్రి రాంగ్ రూట్‌లో వస్తున్న బైక్‌ను లారీ ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం తంబుగనిపల్లెకు చెందిన గడ్డం హరీష్‌నాయుడు(27), పరంధామ(33) బైక్‌పై చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్నారు. తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీ పనపాకం వద్ద రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీ కొంది. ఈప్రమాదంలో గడ్డం హరీష్‌నాయుడు, పరంధామ తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందారు. పరంధామకు ఏడాది కిందటే వివాహమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీసీసీబీకి రెండు విశిష్ట అవార్డులు



డీసీసీబీ చైర్మన్‌కు అవార్డు బహూకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ (ఆప్కాబ్) 62వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం విజయవాడలోని గవర్నర్‌పేట ఎం.బి. విజ్ఞానకేంద్రంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్‌శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హాజరుకాగా, ఆప్కాబ్ చైర్మన్ గన్నె వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాయలసీమలోని సహకార బ్యాంకుల పరిధిలో డిపాజిట్లు, రుణపంపిణీ, వసూళ్ళు నిర్ణీత గడువుకంటే ముందుగానే సింగిల్ విండోల కంప్యూటరీకరణ వంటి అంశాలను ప్రాతిపదికన తీసుకుని 'ఓవరాల్ పర్ఫార్మెన్స్' కింద 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఉత్తమ పనితీరు కనబరచిన చిత్తూరు జిల్లా సహకార బ్యాంకును అవార్డుకు ఆప్కాబ్ ఎంపిక చేసింది.మంత్రి అచ్చెన్నాయుడు చేతులమీదుగా చిత్తూరు డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర రెడ్డి, ఆప్కాబ్ చైర్మన్ గన్నె వీరాంజనేయులు చేతులమీదుగా బ్యాంకు సీఈవో సి. శంకర్‌బాబు సర్టిఫికెట్, మెమెంటోతో పాటు రూ.3లక్షల నగదు బహుమతిని అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలుగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి కోసలనగరం, వాయల్పాడు, ఏర్పేడు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రేణిగుంట, మదనపల్లె, గంగాధరనెల్లూరు సింగిల్ విండోలు అన్నిరంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఆప్కాబ్ ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయా సింగిల్‌విండోల త్రిసభ్య కమిటీ చైర్మన్లు, సీఈవోలు కార్యక్రమానికి హాజరై మంత్రి నుండి సర్టిఫికెట్, మెమెంటో, రూ.20 వేల చొప్పున పారితోషికాన్ని అందుకున్నారు. ఆప్కాబ్ ఎండీ డాక్టర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, ప్రత్యేక ప్రభుత్వ కార్యదర్శి రాజశేఖర్, సహకారశాఖ రిజిస్ట్రార్ అహ్మద్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నుంచి అవార్డును స్వీకరించిన ఆరు సింగిల్ విండోల చైర్మన్లు, సీఈవోలతో డీసీసీబీ సీఈవో సి. శంకర్ బాబు

ఐఐటీ,ఐసర్‌లను సందర్శించిన ఒడిశా గవర్నర్



ఐఐటీలో డీన్లు,అధ్యాపక బృందంతో సమావేశమైన డాక్టర్ హరిబాబు

ఏర్పేడు,ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు వద్ద తిరుపతి ఐఐటీని ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు సోమవారం దర్శించారు. సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ అధ్వర్యంలో ఆయనకు అధ్యాపకులు స్వాగతం పలికారు. గత పదేళ్లలో సాధించిన అభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తరువాత డీన్స్ అధ్యాపకులు, విభాగాధిపతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఎన్ఈపీ-2020 అమలు, పీహెచ్‌సీహెచ్ కేసుల సమయానుకూల పరిష్కారం, పరిశ్రమలతో కలిసి నైపుణ్యాతాభివృద్ధి కోర్సులు లాంటి అంశాలపై మాట్లాడారు. అధ్యాపకులు ఏటా మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలన్నారు. అనంతరం డీఎస్టీ అధ్వర్యంలో ఐఐటీ టెక్నాలజీని పరిశీలించారు. ఒడిశా గవర్నర్ ఐసర్‌ను కూడా సందర్శించారు.సంస్థలో ఆధునిక మౌలిక సదుపాయాలను గురించి తెలుసుకుని అభినందించారు. త్రినేత్ర విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. యాజమాన్యం, బోధన సిబ్బంది, విద్యార్థుల నిబద్ధతను కొనియాడారు. ఐసర్ డైరక్టర్ శాంతను బట్టాచార్య, రిజిస్ట్రార్ ఇంద్రపీత్‌సింగ్ కోహ్లీ, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి సన్నిధిలో 'హను అబ్బవరం'


కుమారుడితో కిరణ్ అబ్బవరం దంపతులు

తిరుమల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): స్వామి సన్నిధిలో తన కుమారుడికి 'హను అబ్బవరం' అని నామకరణం చేసినట్టు సినీ హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. భార్య నటి రహస్య, కుమారుడితో కలిసి సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. హనుమజ్జయంతి రోజున పుట్టినందున కొడుక్కి హను అబ్బవరం అని పేరు పెట్టుకున్నామని చెప్పారు. ప్రస్తుతం 'చెన్నై లవ్ స్టోరీ', 'కె ర్యాంప్' సినిమాల షూటింగ్ జరుగుతోందన్నారు.


ఆలయం వద్ద సూర్య, జ్యోతిక దంపతులు - కుమారుడు దేవ్, కుమార్తె దియా

తిరుమలలో సూర్య, జ్యోతిక

ప్రముఖ తమిళ హీరో సూర్య, జ్యోతిక దంపతులు సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి తిరుమలకు చేరుకున్న వీరు సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తమ ఇద్దరు పిల్లలు దేవ్, దియా పాటు స్వామిని దర్శించుకున్నారు. సూర్య దంపతులను చూసేందుకు, వారితో సెల్ఫీల కోసం అభిమానులు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.25 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,628

తలనీలాలు సమర్పించినవారు: 30,339



టీటీడీకి విరాళంగా ఎలక్ట్రిక్ స్కూటర్



టీటీడీకి సోమవారం ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళంగా అందింది. విజయవాడకు చెందిన క్వాంటం ఎనర్జీ లిమిటెడ్ ఎండీలు శ్రీనివాస్, చక్రవర్తి రూ.1.05 లక్షల విలువైన బిజినెస్ ఎక్స్‌పీ స్కూటర్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

విద్వేషాలను రెచ్చగొట్టేవారి పనిబట్టండి స్వామీ!

● మంత్రి కొలుసు పార్థసారథి


కొలుసు పార్థసారథి

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఎక్కడైనా, ఎవరైనా విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే.. అటువంటి వాటిని అణగదొక్కాలని స్వామిని ప్రార్థించానని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, శ్రీవారి ఆశీస్సులతో రాష్ట్రంలోని రిజర్వాయర్లన్నీ నీటితో కళకళలాడుతున్నాయన్నారు.

అప్పర్ సీలేరుకు బయలుదేరిన తిరుపతి కబడ్డీ జట్టు


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన తిరుపతి విద్యుత్ ఉద్యోగుల కబడ్డీ జట్టు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): అప్పర్‌సీలేరులో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి సర్కిల్ జట్టు బయలు దేరి వెళ్ళినట్లు ఆ జట్టు మేనేజరు స్పోర్ట్స్ కార్యదర్శి లీలారామ్ తెలిపారు. అప్పర్ సీలేరులో రాష్ట్ర స్థాయిలో విద్యుత్ ఉద్యోగులకు కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలు ఉంటాయని చెప్పారు. గత వారం రోజుల నుంచి జట్టు మేనేజరు టి.జయరామ్ అధ్వర్యంలో కబడ్డీ క్రీడాకారులకు మంచి శిక్షణ ఇచ్చారని కార్యదర్శి చెప్పారు. గతంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తిరుపతి సర్కిల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సారి తమ జట్టు ప్రథమ స్థానం సాధిస్తుందని ఆశిస్తున్నామని ఆయన తెలిపారు.

అన్నప్రసాద నాణ్యత ఎలా ఉంది?

● భక్తులతో మాట్లాడిన ఈవో, అదనపు ఈవో


భక్తుల అభిప్రాయం తెలుసుకుంటున్న ఈవో, అదనపు ఈవో

తిరుమల, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): అన్నప్రసాదాల నాణ్యత ఎలా ఉందంటూ టీటీడీ ఈవో శ్యామలరావు అడిగి తెలుసుకున్నారు. సోమవారం ఆయన అదనపు ఈవో వెంకయ్యచౌదరితో కలిసి తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాల నాణ్యత, రుచిని స్వయంగా పరిశీలించారు. అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న కొందరు భక్తులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయలు తెలుసుకున్నారు. వీరూ భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. తర్వాత కియోస్క్ మిషన్ ద్వారా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు విరాళమిచ్చారు. అన్నప్రసాద భవనంలోని క్యూలైన్లు, పరిశుభ్రత, ముడి సరుకుల నిల్వ గది తదితర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. గ్యాస్ ప్లాంట్‌నూ పరిశీలించారు. ఈకార్యక్రమంలో అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'అమరరాజా'లో హరియాణా మాజీ డిప్యూటీ సీఎం


అమర్ రాజా పరిశ్రమలో మొక్కలు నాటుతున్న దుష్యంత్ సింగ్ చౌటాల

రేణిగుంట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కరకంబాడి, చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలోని అమర రాజా పరిశ్రమను హరియాణా మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ సింగ్ చౌటాల సోమవారం సందర్శించారు. పరిశ్రమలోని పచ్చదనం అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అమరరాజా గ్రూప్ పరిశ్రమలు దేశంలో వ్యాపార మేధస్సు సాంకేతిక ఆవిష్కరణలకు ప్రతీక అని కొనియాడారు. పరిశ్రమ లోపల పర్యావరణం, పరిరక్షణ, నాణ్యత ప్రమాణాలు, సమాజ అభివృద్ధి వంటి అంశాలలో అమర గ్రూప్స్ చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమరరాజా గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా జయదేవ్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ నరసింహులునాయుడు పాల్గొన్నారు.

భూసమస్యలు బోలెడు

● పరిష్కరించాలంటూ బాధితుల వేడుకోలు

● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 302 అర్జీలు


వినతిపత్రాలను స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 'మా భూములు కబ్జా అయ్యాయి. మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మీరైనా పరిష్కారం చూపండి' అంటూ ఎందరో బాధితులు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 02 అర్జీలు రాగా, అందులో 162 భూ సమస్యలకు సంబంధించినవే. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జేసీ ఆదేశించారు.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

వితంతు పింఛను ఇచ్చి ఆదుకోండి



'నా భర్త గ్రానైట్ వేసే కూలీపనికి వెళ్లేవాడు. పది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ పోషణ భారంగా మారింది. వితంతు పింఛను ఇప్పించి ఆదుకోండి' అంటూ గీత అధికారుల ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు.



మా భూములు కబ్జా చేశారు.. పరిరక్షించండి

మాభూమిని గెరటయ్య అనే వ్యక్తి కబ్జా చేశాడంటూ బాలాయపల్లి మండలం వాక్యం గ్రామానికి చెందిన విజయమ్మ, మరికొందరు కలిసి అధికారులకు ఫిర్యాదు చేశారు. 'గ్రామంలోని 8 ఎకరాల్లో 30 ఏళ్లుగా వర్షాధారంగా పంటలు సాగు చేసుకుంటున్నాం. ఐదేళ్ల కిందట నిమ్మ మొక్కలు నాటాం. గెరటయ్య దౌర్జన్యంగా ప్రవేశించి నిమ్మ చెట్లను తొలగించారని తిరిగి ఫెన్సింగ్ వేస్తే దానిని దౌర్జన్యంగా తొలగించాడని బాధితులు అధికారులెదుట వాపోయారు. ఇలా పంటలపై దౌర్జన్యం చేస్తుంఢటంతో సదరు భూమిపై కబ్జాదారులుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మా ఇంటి స్థలం కబ్జాచేశారు.



'మాది నిరుపేద కుటుంబం. నా వికలత్వ పింఛనుతో తల్లిదండ్రులను పోషించుకుంటున్నా. ఆరు సెంట్ల ఇంటి స్థలాన్ని చెల్లయ్య, తిరుపాలు తదితరులు కబ్జా చేశారు. నేను వికలాంగుడిని కావడంతో నాపై దౌర్జన్యం చేసి దూషిస్తున్నారు' అంటూ సత్యవేడుకు చెందిన సౌందరరాజ్ ఆవేదన చెందారు. కబ్జాదారులు ఆక్రమించిన ఇంటి స్థలాన్ని తిరిగి ఇప్పించాలని అధికారుల ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు.

మౌలిక వసతులు కల్పించండి



మాది పుత్తూరు మండలం నంది మంగళం పంచాయతీలోని ఎన్టీఆర్ కాలనీ. మా దళితవాడలో మౌలిక వసతులు కల్పించండి.. అంటూ కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. కోనేటిపాళెంలో దళితవాడకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, ఇంటి స్థలాలు కల్పించాలని కోరారు. లైబ్రరీ, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలన్నారు.



22 ఏ నుంచి మా భూములకు విముక్తి కలిగిచండి

తిరుపతి రూరల్ మండలం దామినేడులోని 22/ఏ నుంచి తమ భూములకు విముక్తి కలిగించాలని దామినేడు ప్లాట్ల సంక్షేమ సంఘం నేతలు అధికారులను కోరారు. నిషేధిత జాబితా నుంచి తొలిగించి తమకు న్యాయం చేయాలన్నారు.

పాఠశాలను తొలగించవద్దు


పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్ చేసినట్లయితే ఉన్నత పాఠశాల మనుగడ సాధిస్తుంది.

1958వ సంవత్సరంలో మా గ్రామంలో రాజానగరం (పిచ్చాటూరు మండలం)లో ఎంపీపీ స్కూల్ ఏర్పాటు చేశారు. 1986లో ఉన్నతపాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఎంతో మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 3, 4, 5 తరగతులను వేలూరు గ్రామానికి తరలించారు. తిరిగి మా

ప్రజా ఫిర్యాదులు పరిష్కారంలో బాధ్యతగా పనిచేయండి : ఎస్పీ


ఫిర్యాదులు తీసుకుంటున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖపై ఎంతో నమ్మకంతో జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి విచ్చేసి తమ బాధలను, సమస్యలను ఆవేదన రూపంలో చెప్పుకోవడానికి వస్తున్నారు. అటువంటి వారి సమస్యలను బాధ్యతగా పట్టించుకుని పరిష్కరించాలని ఎస్పీ హర్షవర్దన రాజు ఆదేశించారు. ఆయా పోలీసు స్టేషన్లలో అధికారులు స్పందించని పక్షంలో అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. తిరుపతిలో సోమవారం ఎస్పీ నేతృత్వంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 102 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను ఎస్పీ ఎదుట ఏకరువు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఎస్పీలు వెంకటనారాయణ, సీఐలు సాధిక్ ఆలీ, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీలో వైభవంగా భాషోత్సవం

● శోభాయాత్రలో పాల్గొన్న వివిధ ప్రాంతాల ప్రతినిధులు


సదస్సులో ప్రసంగిస్తున్న సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భాషోత్సవం పేరుతో రెండు రోజులపాటు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్వహించే జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ప్రారంభ సూచకగా యూనివర్సిటీలోని స్వామి నారాయణ అక్షర పురుషోత్తమ మండపం నుంచి సభా ప్రాంగణం దాకా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నారావు భవనంలో నిర్వహించిన ప్రారంభ సభలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. చాలా ప్రాధాన్యత గల అంశంపై ఉత్కల పీఠం జాతీయ సదస్సు నిర్వహించడం శుభ సూచకమన్నారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆన్‌లైన్ ద్వారా అనుగ్రహ భాషణం చేశారు. న్యూఢిల్లీకి చెందిన స్వామి నారాయణ సంప్రదాయ అక్షరధామ్ అధ్యక్షుడు సాధు భద్రేశదాస్ స్వామి మాట్లాడుతూ.. పురుషోత్తమ భాష్యం అనేది ప్రస్థాన త్రయానికి సంబంధించినది అన్నారు. అక్షర పురుషోత్తమ భాష్యం రాయడానికి మునుపు ఇందులోని గొప్పదనాన్ని తెలుసుకోవాలని కోరారు. యూజీసీ వైస్ చైర్మన్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. ప్రస్థాన త్రయ భాష్యం సామాజికంగా ఎంత అవసరమో ఆలోచించాలన్నారు. దీనిని సామాజిక ఔన్నత్యానికి అవసరమైన విధంగా రూపొందించాలని సూచించారు. ఐసీపీఆర్ సభ్యుడు సచ్చిదానంద మిశ్రా మాట్లాడుతూ.. సంస్కృత భాషలోనే కాకుండా, ఇతర భాషల్లోనూ ప్రస్థాన త్రయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. సంస్కృత వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ హరేకృష్ణ శతపథి మాట్లాడుతూ.. ప్రస్థాన త్రయం వల్ల మానవ జీవన విధానం గొప్ప స్థితికి చేరుతుందని అభిప్రాయపడ్డారు. ఢిల్లీలోని లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత వర్సిటీ వీసీ మురళీ మనోహర్ పాఠక్ మాట్లాడుతూ.. ప్రస్థాన త్రయ భాష్యం, క్రియాన్వయనం ఆధునిక సమాజ అవసరాలకు అనుగుణంగా ఎలా రూపొందించాలనే విషయంపై అవగాహన అవసరమన్నారు. గుజరాత్‌లోని సోమనాథ సంస్కృత వర్సిటీ వీసీ సుఖాంత్‌కుమార్ సేనాపతి మాట్లాడుతూ.. వేదాంతాది శాస్త్రాల్లో ప్రస్థాన త్రయానికి ఔన్నత్యం ఉందనీ, మంచి ఫలితాలు కూడా ఉన్నాయన్నారు. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ రాణిసదాశివ మూర్తి మాట్లాడుతూ.. వేద విజ్ఞానంలో ప్రస్థాన త్రయం గొప్ప ప్రాముఖ్యత కలదన్నారు. ఇందులోని విశేషాలను ఈ తరానికి అవసరమైన విధంగా విశ్లేషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్కల పీఠం డైరెక్టర్ జ్ఞానరంజన్ పండా, సలహాదారు ప్రొఫెసర్ శంకర నారాయణ, పలు ప్రాంతాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం

సీపీఐ జిల్లా ముగింపు సభలో మాజీ ఎమ్మెల్సీ విల్సన్


సభలో మాట్లాడుతున్న జల్లి విల్సన్

సూళ్లూరుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. సూళ్లూరుపేటలో రెండు రోజుల పాటు నిర్వహించిన సీపీఐ జిల్లా రెండో మహాసభల ముగింపు సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ సీపీఐ పుట్టినప్పటి నుంచి కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటు చేస్తోందన్నారు. ప్రధాని మోదీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలయ్యిందని ధ్వజమెత్తారు. ఆర్ఎస్ఎస్ ఆదేశాల మేరకే మోదీ దేశాన్ని పాలిస్తున్నారని, ప్రజాస్వామ్యంబద్ధంగా ఏదీ జరగడం లేదన్నారు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం నినాదంతో మత కలహాలు సృష్టించి రాజకీయంగా లబ్ధిపొందుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ, అటవీ భూములను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసి పేదల కడుపుకొతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్ ప్రజాస్వామ్యంబద్ధంగా వ్యహరించకపోవడంతో ప్రజలు బుద్ధి చెప్పిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ నేడు ఎందుకు మౌనంగా ఉంటోందని ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథరెడ్డి మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేయడంలో కీలక భూమిక కమ్యూనిస్టులదేనని స్పష్టం చేశారు. అంతకుముందు సీపీఐ జిల్లా నాయకుడు మోదుగుల పార్థసారధి పార్టీ జెండా ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, చిన్నం పెంచలయ్య, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, శివారెడ్డి, జయలక్ష్మి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆలయాలకు 'సౌభాగ్యం'

తిరుమల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): శుక్రవారం జరిగే వరలక్ష్మీ వ్రతం సందర్భంగా టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్తంగా టీటీడీకి చెందిన రెండు తెలుగు రాష్ట్రాల్లోని 51 ఆలయాల్లో సౌభాగ్యం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సౌభాగ్యవంతులకు గాజులు, పద్మావతి అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, పసుపు దారాలు, అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శతనామావళి పుస్తక ప్రసాదాలు అందించనున్నారు. ఈ సందర్భంగా సుమంగళి ద్రవ్యాలను పంపిణీ చేసేందుకు ఓ అజ్ఞాత భక్తులు విరాళంగా అందించిన 8 లక్షల గాజులు, 1.40 లక్షల చొప్పున కంకణాలు, పసుపుదారాలు, కుంకుమ ప్యాకెట్లు, పుస్తకాలు ఆయా ఆలయాలకు పంపారు.

అమ్మవారికి కానుకగా 5వేల డజన్ల గాజులు


ఆలయాధికారులకు గాజులు, పసుపు కుంకుమ అందిస్తున్న దాత షణ్ముగం

తిరుచానూరు, ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 8న జరగనున్న వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని స్థానికులైన సివిల్ ఇంజనీర్ షర్మిళ షణ్ముగం దంపతులు 5వేల డజన్ల గాజులు, పదివేల కంకణాలు, పదివేల పసుపు కుంకుమ ప్యాకెట్లను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు

తిరుపతి(నేరవిభాగం),ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అతిగా మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి ప్రత్యేక నాలుగవ అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ఇతడితో పాటు మరో 18 మంది మందుబాబులకు రూ.10 వేల వంతున రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు

తిరుమల ఉద్యోగుల క్వార్టర్స్‌లో చోరీ


చోరీ జరిగిన ఇంటి పరిశీలిస్తున్న పోలీసులు

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఉద్యోగుల క్వార్టర్స్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.20 వేల నగదు, 12 గ్రాముల బంగారు బ్రాస్‌లైట్‌ను అపహరించారు. డీటైప్ క్వార్టర్స్‌లోని మహేంద్ర అనే టీ వ్యాపారి ఇంట్లో ఆదివారం రాత్రి ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ శ్రీరాముడు తెలిపారు. కాగా స్థానికులు నివాసించే బాలాజీనగర్‌లో 30 మంది పోలీసులు ఏరియా డామినేషన్ నిర్వహిస్తున్న సమయంలోనే ఈ చోరీ జరగడం గమనార్హం.

5 కిలోల గంజాయి స్వాధీనం - ఒకరి అరెస్టు

ఓజిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారికి సమీపంలో సోమవారం 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, బెంగళూరుకు చెందిన పటాన్ షారూక్‌ను ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేసేందుకు వెళుతుండగా పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి బ్యాగ్‌తో ఓ అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా బెంగళూరుకు చెందిన షారూక్‌గా తెలిసింది. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో 5 కిలోల గంజాయి లభ్యమైంది. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

యాప్‌ల భారం మోయలేం

మొబైల్స్ అప్పగించిన అంగన్‌వాడీలు



మొబైల్స్‌ను సీడీపీవో కార్యాలయంలో అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్ల అసోసియేషన్ నేతలు

కోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలకు సంబంధించి పలు యాప్‌ల వల్ల పనిభారం పెరుగుతోందని అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ప్రభుత్వం ఇచ్చిన మొబైల్స్‌ను కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్ల అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని 224అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి ఒక్కొక్క వర్కర్‌కు మొబైల్ ఫోన్‌ను ప్రభుత్వం అందజేసిందన్నారు. ఈ ఫోన్లలోని యాప్‌లలో వివిధ పథకాల సమాచారం నమోదు చేయాల్సి ఉండడంతో పనిభారం ఎక్కువైందన్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన మొబైల్స్‌ను అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకులు పద్మలీల, విజయలక్ష్మి, కోటేశ్వరి ద్వారా కోట ఐసీడీఎస్ కార్యాలయంకు స్వాధీనం చేసినట్లు తెలిపారు.

యోగాలో గిన్నిస్‌రికార్డు సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ



ద్వారకేష్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న రోటరీ వెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో సోమవారం యోగాసనాల్లో గిన్నిస్‌రికార్డు సాధించిన విద్యార్థి కట్టా ద్వారకేష్‌కు రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో లక్ష్మీ, పీఎం రావు దాతృత్వంతో ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఇటీవల చెన్నైలో నిర్వహించిన కేలో ఇండియా యోగాసనాల పోటీల్లో గూడూరుకు చెందిన ద్వారకేష్ పాల్గొని 3.45 నిమషాల పాటు విపరీతసలబాసనం వేసి గిన్నిస్ రికార్డును సాధించడం జరిగిందన్నారు. ద్వారకేష్‌ను అభినందిస్తూ రూ.50వేలు విలువచేసే ల్యాప్‌టాప్ అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, శ్రీలక్ష్మి, పీఎం రావు, సనత్ కుమార్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, తాళ్లూరు శ్రీనివాసులు, గిరిబాబు, సుబ్రమణ్యం, రామ్మోహన్, కృష్ణ, కట్టా రాజా, కట్టా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ స్థలం ఆక్రమిస్తే చర్యలు

గూడూరు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని కోదండ రామాంజనేయస్వామి ఆలయ ఆవో రవికృష్ణ హెచ్చరించారు. సోమవారం స్థానిక ఇందిరానగర్ సమీపంలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి చెందిన స్థలాన్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే చేశామన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి బోరు వద్ద టీడీపీ నాయకులు

పెళ్లకూరు, ఆగష్టు 4 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంలు అర్లపాడు గ్రామంలో జూలై 28 తేదీన పర్యటించారు. అర్లపాడు దళితకాలనీ వాసులు తాగునీటి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. అప్పుడు వారిచ్చిన హామీ మేరకు సోమవారం కొత్తగా బోరు వేసి మోటర్ అమ్చ తాగునీరు అందించారు. మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవలకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధక్షుడు నంచి కృష్ణయ్య, నాయకులు పాలచ్చూరు సుబ్బరామయ్య, నరేంద్రయాదవ్, నేలవల్లి సిద్దులయ్యానాయుడు, ఈర్ల రమేష్, నాగరాజు, బాబు, మునెయ్య మణి తదితరులు ఉన్నారు.

మహిళల భద్రతకు శక్తియాప్



విద్యార్థినులతో కళాశాల సిబ్బంది

గూడూరు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసం పోలీస్‌శాఖ శక్తియాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. సోమవారం కళాశాలలో విద్యార్థులకు శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు శక్తియాప్‌ను =డౌన్‌లోడ్ చేసుకుని ఏదైనా సమస్య ఉన్నప్పుడు అందులో తెలియజేస్తే పోలీస్‌శాఖ రక్షణగా ఉంటుందన్నారు. అలాగే విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగివుండాలన్నారు. కార్యక్రమంలో ఝాన్సీ, విజయశ్రీ, డాక్టర్ వీర్‌కుమార్, కోటేశ్వరరావు, సురేంద్ర, విజయమహేష్, కిరణ్మయి, లక్ష్మీ, శ్రీధర్‌శర్మ పాల్గొన్నారు.

పీజీ అడ్మిషన్లు వెంటనే చేపట్టండి

పీజీసెట్ కన్వీనర్‌కు విద్యార్థి సంఘాల వినతి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో పీజీ అడ్మిషన్లు వెంటనే చేపట్టాలని విద్యార్థి సంఘాలు కోరాయి. ఏఐఎస్‌ఏ నేత చిన్నా, ఎస్ఎఫ్ఐ నేత అశోక్ తదితరులు పీజీసెట్ కన్వీనర్ వెంకటేశ్వర్లును కలిసి ఈ మేరకు విన్నవించారు. పీజీసెట్ ఫలితాలు విడుదలై నెల రోజులైనా అడ్మిషన్లు చేపట్టకపోవడం సరికాదన్నారు. వేలాది మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారని, యూనివర్సిటీలో స్వయంగా అడ్మిషన్లు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని కన్వీనర్ వెంకటేశ్వర్లు వారికి హామీ ఇచ్చారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

65 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

గూడూరు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లో అక్రమంగా నిల్వచేసిన 65 బస్తాల రేషన్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారుల వివరాల మేరకు... గాంధీనగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు తన ఇంట్లో 65 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వవుంచినట్లు అధికారులకు సమాచారం అందింది. విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో వీఆర్‌వో వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

దొరవారిసత్రం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం మినమనమూడి గ్రామానికి చెందిన నల్లపాటి సుబ్బమ్మ(50) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ నెల 2న సుబ్బమ్మ ఇంటి వద్ద పురుగుల మందుతాగి అపస్మారకస్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున సుబ్బమ్మ మృతి చెందింది.

విధి నిర్వహణలో అలసత్వాన్ని ఉపేక్షించను: కురుగొండ్ల

వెంకటగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహణ, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలు, బీసీ గురుకుల పాఠశాలలో వసతులు ఎలా ఉన్నాయో తెలుసుకొనేందుకు తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహణ తీరును ఎమ్మెల్యే పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో నరసింహులు, ఎంఈవో బామయ్య మాత్రమే హాజరు కావడాన్ని గమనించిన ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సోమవారం నిర్వహించే ప్రజా విజ్ఞప్తుల దినానికి అధికారులు హాజరు కాకపోవడం దారుణమన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతామన్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసి వైద్య సేవలు ఎలా ఉన్నాయి.. మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని రోగులను ఆరా తీశారు. అలాగే సిబ్బందితో మాట్లాడి ఆస్పత్రిలో సమస్యలను తెలుసుకొన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. తరువాత బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. మరుగుదొడ్లు సరిపోవడం లేదని, తరగతి గదులు, వసతి గదులు ఒక్కటే కావడం వల్ల ఇబ్బందిగా ఉందని విద్యార్థులు చెప్పారు. సంబంధిత శాఖ మంత్రితో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.



బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

సీఎం చంద్రబాబు పేదల పక్షపాతి: పాశిం

కోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడుకు పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని సిద్ధవరం, గోవిందపల్లి, దొరువుకట్ట, దైవాలదిబ్బ గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు మహిళలు హారతులు పట్టి పూలవర్షం కురిపించి స్వాగతం పలికారు. టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి కూటమి పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు అందించారు. సిద్ధవరంలో స్థానిక సర్పంచ్ ఇంగిలాల సుజాత, ఆమె భర్త ఇంగిలాల రామయ్యతో పాటు పెద్దసంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ నాయకుడు చిల్లకూరు దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ చేరారు. వారికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే గోవిందపల్లి, దైవాలదిబ్బలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. అనంతరం గోవిందపల్లి గ్రామానికి దొరువుకట్ట గ్రామానికి చెందిన చిల్లకూరు రామసుబ్బారెడ్డి, సుశీలమ్మ జ్ఞాపకార్థం రూ.7 లక్షలతో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కొత్తపట్నం పంచాయతీలోని ఉయ్యాలమ్మ కిసాన్ గ్రూపునకు రూ.9.80 లక్షలు విలువచేసే డ్రోన్‌ను 80శాతం సబ్సిడీతో అందజేశారు. సీడీపీవో మునికుమారి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలను చేయగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సారె అందించారు.



సర్పంచు సుజాత, ఆమె భర్త రామయ్య దంపతులకు టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, రామలింగారెడ్డి, మురళి, చెంగల్‌రావు, చిన్ని వెంకటకృష్ణయ్య, కోటేశ్వరరావు, రామ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరస్వామి ఆలయానికి కొండేపాటి దంపతులు రూ.2.50 లక్షల విరాళం

కోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలోని కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 13న జరిగే కుంభాభిషేకం కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు రూ.2.50 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆ విరాళాన్ని గంగాప్రసాద్ అభిమానులు ఆలయానికి అందజేశారు. సంగమేశ్వర ఆలయంలోని కామాక్షీదేవి విగ్రహాన్ని పెకిలించి జీర్ణోద్ధరణ చేయనున్నారు. ఇందుకోసం అమ్మవారి విగ్రహాన్ని గర్భగుడి నుంచి తీసివేశారు. ఈనెల 13న మహాకుంభాభిషేకాలు, ప్రత్యేక హోమాల మధ్య అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించనున్నారు. ఈసందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం జరపనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు సాత్విక్‌శర్మ తెలిపారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం



తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

డక్కిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఒక టీకాలా పనిచేస్తాయని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని కంథలవారిపల్లి, వెంబులూరు, దిగువ లింగసముద్రం ఎస్సీకాలనీ, మోపూరు రోడ్డు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వెంకటగిరి సీడీపీవో సంషాద్ బేగం మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యాన్ని, బిడ్డకు అందించే ముర్రుపాలలో ఉండే పోషకాల గురించి వివరించారు. తల్లులు తీసుకోవాల్సిన ఆహార నియమాలను తెలియజేశారు. కార్యక్రమంలో టాటా ట్రస్టు ప్రతినిధి లక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వినీషా, అంగన్‌వాడీ టీచర్ పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన

చిల్లకూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిక్కవరం ఎస్సీకాలనీలో సోమవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుకమ్మ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. పుట్టినబిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో రమణమ్మ, తిప్పమ్మ, రోజా, రాజామణి, సునీత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణదారులపై చర్యలు

డక్కిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెరువులను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రామాపురం గ్రామానికి చెందిన కొంతమంది దౌర్జన్యంగా తమ పొలాల్లో రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని అదే గ్రామానికి చెందిన బాధితులు బహుజన సమాజ్ పార్టీ నాయకుడు జోరేపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తహసీల్దారు ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ మండలంలో అనేక చెరువులు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించడం జరిగిందన్నారు. చెరువుల్లో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పలుగోడు చెరువులో ఆక్రమణలను తొలగించాలని ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామన్నారు. చెరువులతో పాటు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ ప్రసన్నరాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెటర్నరీ తాత్కాలిక రిజిస్ట్రార్‌గా వినూ

తిరుపతిరూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ తాత్కాలిక రిజిస్ట్రార్‌గా గన్నవరం వెటర్నరీ కళాశాల యానిమల్ జెనిటిక్స్ అండ్ బ్రీడింగ్ (ఏజీబీ) విభాగ ప్రొఫెసర్ ఆర్.వినూను నియమిస్తూ సోమవారం వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీరమణ ఉత్తర్వులు జారీ చేశారు. 6నెలలకాలం గానీ లేదా ఈలోపు రెగ్యులర్ నియామకం జరిగే వరకు గానీ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో మూడు రోజుల జైలుశిక్ష

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ తిరుపతి ప్రత్యేక నాలుగో అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. అతనితో పాటు మరో 18 మందికి రూ.10వేలు చొప్పున రూ.1.80 లక్షలు జరిమానా విధించారు.

జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులతో పాఠశాల సిబ్బంది

గూడూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు ఎంపికైన స్థానిక జడ్పీ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థినులను హెచ్‌ఎం మాధవీలక్ష్మి అభినందించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన దీపిక, కౌసల్య, పింకి, శిల్ప, మౌనిక ఇటీవల నర్సారావుపేటలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారన్నారు. వీరిలో ప్రతిభ చాటిన దీపిక, కౌసల్య జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు కల్పనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ భూములను పేదలకు పంచాలి

గూడూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలో పరిశ్రమల పేరుతో తీసుకున్న ప్రభుత్వ భూములు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని పేదలకు పంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, వేమయ్య, సుబ్బరామరాజు, శ్రీహరి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డీఐజీ కుటుంబానికి ఎమ్మెల్సీ బీద పరామర్శ



జెట్టి పుల్లయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

ఓజిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కరబల్లవోలుకు చెందిన డీఐజీ గోపీనాథ్‌జెట్టి కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర పరామర్శించారు. శనివారం గోపీనాథ్‌జెట్టి తండ్రి జెట్టి పుల్లయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఎమ్మెల్సీ రవిచంద్రతోపాటు ఓజిలి, పెళ్లకూరు మండలాల టీడీపీ కన్వీనర్లు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, నంచి కృష్ణయ్య కరబల్లవోలు గ్రామానికి వెళ్లి జెట్టి పుల్లయ్యకు నివాళులర్పించారు. గోపీనాథ్ జెట్టి కుటుంబాన్ని పరామర్శించారు.

నిషేధిత సైలెన్సర్లు, హారన్లు బిగిస్తే చర్యలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పని చేస్తున్న ఆటోమొబైల్ మెకానికల్‌లు నిబంధనలను అతిక్రమించి ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, భారీ వాహనాలకు సైలెన్సర్లు, హారన్లు బిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి హెచ్చరించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో సోమవారం మెకానిక్‌లతో ఆయన సమావేశమయ్యారు. శబ్ద కాలుష్యం చేసే హారన్లు బిగించడం పూర్తిగా నిషేధించామన్నారు. వ్యాపార దృక్పథంతో ఏర్పాటు చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ సీఐ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆప్కో షోరూంలో చోరీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఆప్కో షోరూంలో దొంగలు పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ రైటర్ భానుప్రసాద్ వివరాల మేరకు.. గాంధీరోడ్డులోని ఆప్కో షోరూంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు షట్టర్ తాళం పగులగొట్టి రూ.43వేలు అపహరించారు. ఆదివారం ఉదయం షోరూం తెరవడానికి వచ్చిన మేనేజర్ శ్రీనివాసులు షట్టర్ తాళం పగులకొట్టి ఉండడం గమనించి లోనికెళ్లి పరిశీలించారు. చిన్న బీరువాలో ఉంచిన రూ.43 వేలు కనిపించలేదు. వెస్ట్ సీఐ మురళీమోహన్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లకు మహర్దశ: విజయశ్రీ



తడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పడుతుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం రాత్రి ఆంధ్రజ్యోతితో విజయశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానమైన ఆర్‌అండ్‌బీ రోడ్లు, దొరవారిసత్రం మండలం దొరవారిసత్రం నుంచి పూలతోట వరకు 7 కిలోమీటర్లు, పెళ్లకూరు మండలం చెంబేడు, పునబాకలో 5 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, ఈ రెండు రోడ్లలో దొరవారిసత్రం, పూలతోటకు రూ.2 కోట్లు, చెంబేడు పునబాక రోడ్డుకు రూ.1.5 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆమేరకు ఆర్థికశాఖ నుంచి పూర్తి స్థాయి అనుమతులు సోమవారం వచ్చాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లను పట్టించుకున్న నాథుడే లేడన్నారు. ఎన్నికలకు ముందు తాము ఇచ్చిన హామీ ప్రకారం నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఆర్‌అండ్‌బీ మంత్రి డీసీ జనార్దనరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చిట్టమూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించ వచ్చని జిల్లా శిక్షణ కేంద్రం ఏవో కేవీ శ్రీనివాస్ తెలిపారు. చిట్టమూరు ఏవో నిరంజన్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద సోమవారం చిట్టమూరు రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. రానున్న రబీ వరి సాగులో రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. వరిలో ఎరువులు, నీటి యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. విత్తన శుద్ధి, జీలగలు దమ్ము చేసిన పది రోజుల తరువాత వరి నాట్లు వేసుకోవాలన్నారు. పది రోజుల లోపుల వేస్తే వేడి తాకిడికి వరి నాట్లు చనిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సహాయకులు సురేష్, కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాతమ్మ గుడి స్థలంలో ఆక్రమణను తొలిగించాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట అయ్యప్పగుడి సమీపంలోని జీఎన్‌టీ రోడ్డులో మాతమ్మ గుడి స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు చేపట్టారని, వెంటనే నిర్మాణాలను నిలిపివేయాలంటూ సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కిరణ్మయికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాలగురం బాబు, వెంకటాచలపతి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1972లో అరుందతివాడకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను సైతం ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని అన్నారు. అదే విధంగా మాతమ్మ ఆలయ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని, కనీసం దారి కూడా లేకుండా ఆక్రమించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవో స్పందించి వెంటనే ఆక్రమణలు తొలిగించి న్యాయం చేయాలని కోరారు

గిరిజనులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు



తహసీల్దారు కార్యాలయం వద్ద గిరిజనులతో మట్టం శ్రావణి

గూడూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులకు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తిరుపతి పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆమె మాట్లాడుతూ చెన్నూరు గ్రామానికి చెందిన 50మంది గిరిజనులకు ఆధార్ కార్డులు లేకపోవడంతో వారు సంక్షేమ పథకాలకు దూరమయ్యారని చెప్పారు. గిరిజనుల సమస్యను ఇన్‌చార్జి తహసీల్దారు ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి గుర్తింపు సర్టిఫికెట్లు అందజేశామన్నారు. వీటి ద్వారా ఆధార్ నమోదు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు విద్యే వివేకానందుడి లక్ష్యం



అతిథులను సన్మానిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మహిళలకు విద్యనందించడమే స్వామి వివేకానంద లక్ష్యమని స్విమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ అన్నారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమ దశమ వార్షికోత్సవంలో రెండు రోజైన సోమవారం జరిగిన యువజన సమ్మేళనంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని, లక్ష్యాలను సాధించడానికి ఆత్మవిశాసం ముఖ్యమని పేర్కొన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలన్నారు. ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ మహిళలు ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తి కలిగి ఉండాలన్నారు. అనంతరం అతిథులను సన్మానించారు.